




# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక

సంపుటి: 4 సంచిక: 38, పేజీలు - 08

బుధవారం, జూన్ 5, 2023 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati







NATIONAL

| NDA | INDIA | OTHERS |
|---|---|---|
| 293 | 199 | 51 |

TELANGANA

| CONG | BJP | BRS | MIM | OTHERS |
|---|---|---|---|---|
| 08 | 08 | 0 | 01 | 0 |

Andhra Pradesh

| TDP | YSRCP | JSP | BJP | OTHERS |
|---|---|---|---|---|
| 135 | 11 | 21 | 08 | 0 |

## తెలంగాణలో
# అనూహ్య ఫలితాలు



- కాంగ్రెస్-8 బీజేపీ-8 స్థానాలు కైవసం
- ఎంఐఎం 1, సున్నాకు పరిమితమైన బీఆర్ఎస్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఇంటర్నెట్ డెస్క్: తెలంగాణ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వచ్చేశాయి. మొత్తం 17 లోక్‌సభ స్థానాలకు ఫలితాలు వెల్లడించారు. కాంగ్రెస్ ఎనిమిది చోట్ల గెలుపొందగా బీజేపీ ఎనిమిది చోట్ల జయకేతనం ఎగురవేసింది. ఎంఐఎం తన సీటును పదిలపరుచుకోగా బీఆర్ఎస్ ఎక్కడా ఖాతా తెరవలేకపోయింది. ఖమ్మం, నల్గొండ, వరంగల్ మహబూబాబాద్, జహీరాబాద్, భువనగిరి, నాగర్ కర్నూలు, పెద్దపల్లిలో కాంగ్రెస్ విజయఢంకా మోగించగా ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ ఘన విజయం సాధించారు. 78 వేలకు పైగా మెజార్టీతో గెలుపొందారు. ఖమ్మం పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి రఘురాం రెడ్డి విజయం సాదించారు. ఆయన 4.56 లక్షల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల సికింద్రాబాద్‌లలో బీజేపీ అభ్యర్థులు గెలిచారు. తెలుగు రాష్ట్రాల చరిత్రలోనే అత్యధిక

6లో ▶

## ఇదొక చారిత్రక
# ఘట్టం



### - ఎన్నికల ఫలితాలపై ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ :** దేశంలో మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామని ప్రధాని నరేంద్ర మోడీ. సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన అనంతరం దేశ ప్రజలనుద్దేశించి మోడీ మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అనే మంత్రం గెలిచిందని వ్యాఖ్యానించారు. మన దేశంలో ఎన్నికల ప్రక్రియను చూసి ప్రజలంతా గర్వపడుతున్నారని ప్రధాని మోడీ అన్నారు. ఈ ఎన్నికల వల్లే మన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందని అన్నారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించి ఎన్నికల సంఘం గర్వపడేలా చేసిందని అభినందించారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు చెప్పుకొచ్చారు. 1962 తర్వాత మూడోసారి ఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి రాలేదు అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ప్రతి రాష్ట్రంలో ఎన్డీయేకు ప్రజలు పట్టం కట్టారని చెప్పారు. ఒడిశాలో కూడా బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏపీ, ఒడిశా రాష్ట్రాల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలో గొప్ప గెలుపు సాధించామన్నారు. తెలంగాణలోనూ బీజేపీకి ఉన్న సీట్లు డబుల్ అయ్యాయని ప్రధాని మోడీ హర్షం వ్యక్తం చేశారు. కేరళలో కూడా తొలిసారి ఒక సీటు గెలుచుకున్నామని ప్రధాని మోడీ వెల్లడించారు. అంతేగాక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, ఢిల్లీలో దాదాపు క్లీన్ స్వీప్ చేశామని ప్రధాని మోడీ చెప్పారు. దేశంలోని కోట్లాది మంది మహిళలు తమను ఆశీర్వదించారన్నారు. పేద ప్రజలకు సేవ చేసేందుకు మరింత ఉత్సాహంగా ఉన్నామన్నారు. తాము రాకముందు ప్రజలు నిరాశ, నిస్పృహల్లో ఉన్నారని చెప్పారు. 2014కి ముందు అన్ని పేపర్లలో కుంభకోణాలే కనిపించేవన్నారు. తమ సేవలు చూసి

6లో ▶

## జగన్ నాకు వ్యక్తిగత
# శత్రువు కాదు

### - భవిష్యత్తులో వైసీపీని ఇబ్బంది పెట్టే ప్రసక్తే లేదు

- ఫలితాల తర్వాత తొలిసారి జనసేన ల చీఫ్ ప్రెస్‌మీట్
- ఇది చారిత్రాత్మకమైన రోజు అన్న జనసేనాని
- ఐదు కోట్ల మంది ప్రజల కోసం పనిచేస్తానన్న పవన్
- ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని వ్యాఖ్య

6లో ▶



## ఏపీ ఎన్నికల ఫలితాలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందన

2లో ▶

## కేసీఆర్ అడ్రస్ గల్లంతైంది

2లో ▶

## ఆంధ్రప్రదేశ్ ఫలితాల్లో
# టీడీపీ క్లీన్‌స్వీప్

- సింగిల్‌గా మ్యాజిక్ ఫిగర్ సొంతం
- చిత్తుచిత్తు ఓడిన వైసీపీ

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఊహించని పరాభవం ఎదురైంది. 175 స్థానాలకు గానూ కేవలం 11 స్థానాల్లోనే గెలిచింది. గత ఎన్నికల్లో 150కిపైగా గెలిచి ఈసారి ఇంత తక్కువ సీట్లు సాధించడం

6లో ▶



## బీఆర్ఎస్‌కు
# గుండు 'సున్నా'

### - ఆరు నెలల్లో అంతా రివర్స్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆరు నెలల క్రితం వరకు అధికార పార్టీ 88 అసెంబ్లీ సీట్లు, 9 ఎంపీ సీట్లతో రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా ఏకఛత్రాధిపత్యం. కట్ చేస్తే ఇప్పుడు 39 అసెంబ్లీ స్థానాలతో ప్రతిపక్షానికి పరిమితం. అతితక్కువ ఓటింగ్

6లో ▶

## మోడీ, షాలను
# తిరస్కరించారు

### - లోక్‌సభ ఫలితాలపై రాహుల్ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అగ్రనేతలు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. లోక్‌సభ ఫలితాల్లో ప్రజలు ఏ ఒక్క పార్టీకి మెజారిటీ ఇవ్వకపోయినా ప్రధాని నరేంద్ర మోడీకి ఇది రాజకీయంగా, నైతికంగా పరాజయమని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ఢిల్లీలో

6లో ▶

# మంచి చేసిన ఓడించారు



- ఏపీలో వైసీపీ ఓటమి
- ఏం జరిగిందో తెలియడం లేదన్న జగన్
- ప్రజలకు ఎంతో మంచి చేశామన్న జగన్
- చేసిన మంచి ఏమైపోయిందో తెలియడం లేదని తీవ్ర ఆవేదన
- సీఎం పదవికి రాజీనామా చేసిన జగన్
- కొత్త ప్రభుత్వం ఏర్పాటు వరకు ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలన్న గవర్నర్

6లో ▶

## ఎదురుతన్నిన ఎగ్జిట్ పోల్స్

6లో ▶



# ఏపీ ఎన్నికల ఫలితాలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందన

**- చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు అభినందనలు**
**- ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగిద్దామంటూ పిలుపు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు వచ్చాయి. ఏ పార్టీ గెలిచినా సాధారణ మెజారిటీ వస్తుందని అంతా భావించగా.. ఎగ్జిట్ పోల్స్ కు భిన్నంగా ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించింది. ఏపీ అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో విజయం సాధించిన ఎన్డీఏ కూటమికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ లకు అభినందనలు తెలిపారు. ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడుతున్నందున.. తెలుగు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకుంటూ, అభివృద్ధి పథం వైపు సాగుదాం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. ఏపీ ఎన్నికల్లో విజయం సాధించిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లకు తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్న టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ లకు కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

# కేసీఆర్ అడ్రస్ గల్లంతైంది

## - బండి సంజయ్ సంచలనం



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** కరీంనగర్ బరిలో హోరాహోరీగా పోరాడిన బండి సంజయ్ తెలంగాణ లోక్సభ ఎన్నికల ఫలితాలలో సత్తా చాటారు. రికార్డ్ బ్రేక్ చేస్తూ భారీ మెజారిటీతో గెలుపొందారు. 2019 లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బండి సంజయ్ కు 89 వేల 508 ఓట్ల మెజారిటీ కట్టబెట్టిన ప్రజలు ఈసారి ఏకంగా 2 లక్షల 25వేల పైచిలుకు ఓట్లు కట్టబెట్టి బండి సంజయ్ పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. బండి సంజయ్ విజయం సాధించడంతో కరీంనగర్లో బిజెపి పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం బండి సంజయ్ వ్యాఖ్యలు కీలక వ్యాఖ్యలు చేశారు. నన్ను ఓడించాలని కుట్రలు చేస్తే, కెసిఆర్ అడ్రస్ మొత్తానికే గల్లంతయింది అంటూ బండి సంజయ్ పేర్కొన్నారు. బండి సంజయ్ గలీజోడు ముస్లింలంతా ఏకమై ఆయనను ఓడించాలని కేసీఆర్ పిలుపునిచ్చారని.. కానీ అందరూ ఏకమై నన్ను భారీ మెజారిటీతో గెలిపించారన్నారు. తనను ఓడించేందుకు ఒక వర్గం ఓట్లను ఏకం చేయాలనుకున్న కేసీఆర్, కాంగ్రెస్ నేతలు ఎన్ని కుట్రలు చేసినా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించి కరీంనగర్ ప్రజల దమ్ము చూపారని కొనియాడారు. కరీంనగర్ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హవాతోనే తనకు ఇంతటి మెజారిటీ దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇకనైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన పోరాడి ఆ పార్టీ అంతు చూస్తామని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు బీజేపీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. కాంగ్రెస్ వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. 6 నెలలు దాటింది. మరో 3 నెలలు టైమిస్తున్నాం ఇచ్చిన మాటకు కట్టుబడి 6 గ్యారంటీలతోసహా హామీలన్నీ అమలు చేసి తీరాలని బండి సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లేనిపక్షంలో ప్రజలందరినీ ఏకం చేస్తాం తెగించి కొట్లాడతాం. కాంగ్రెస్ సంగతి చూస్తాం అన్నారు. రాజ్యాంగం మారుస్తారని, రిజర్వేషన్లు ఎత్తేస్తారని ఇండీ కూటమి దేశవ్యాప్తంగా విష ప్రచారం చేసిందని, ఇంటికో లక్ష రూపాయలు అకౌంట్లో వేస్తామంటూ సాధ్యంకాని హామీలు గుప్పించి ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేసిందని బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ తో పాటు ఇండి కూటమిని టార్గెట్ చేశారు. దక్షిణ భారతం, ఉత్తర భారతం అంటూ దేశాన్ని చీల్చేందుకు కూడా వెనుకాడలేదు వీటితో ప్రజలు అయోమయానికి గురయ్యారు. లేకుంటే ఎన్డీఏకు 4 వందల సీట్లు వచ్చేవన్నారు బండి సంజయ్.

# మోదీ మ్యాజిక్ ఏమైంది.?

**- మోదీ - షాల చాణక్యం పనిచేయలేదా.?**
**- సొంతంగా అధికారంలోకి ఎందుకు రాలేకపోయింది?**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఎన్డీఏ కూటమి గత 10 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో కొనసాగుతోంది. 2014 తో పోల్చితే నరేంద్ర మోదీ మరింత బలమైన నాయకుడిగా మారారు. దేశం మొత్తం మోదీ మేనియా నడుస్తోంది. బీజేపీ అడుగుపెట్టని రాష్ట్రంలో కూడా విజయాలు సాధించింది అంటే అది నరేంద్ర మోదీ చేసిన మ్యాజిక్ వల్లే. ఇక 2014, 2019 లోక్సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా మెజార్టీ సాధించిన బీజేపీ అనూహ్యంగా ఈసారి 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం మేజిక్ ఫిగర్‌ను అందుకోలేక పోయింది. నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ తొలిసారి మిత్ర పక్షాల మద్దతుతో కేంద్రంలో అధికారాన్ని ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఎన్నికల ప్రచారంలో ఎక్కడ చూసినా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుంచి మొదలుపెడితే సామాన్య కార్యకర్త వరకు "అబ్ కీ బార్ చార్ సౌ పార్" అనే నినాదం వినిపించారు. కానీ ఫలితాల వద్దకు వచ్చేసరికి అది పనిచేయలేదు. 2019 ఎన్నికల్లో 303 స్థానాలు గెలుచుకుంటే ప్రస్తుతం మాత్రం 240 స్థానాలకే పరిమితమైంది. దీంతో 10 ఏళ్ల చరిత్రలో తొలిసారి అధికారాన్ని ఏర్పాటు చేసేందుకు మిత్రపక్షాలపై ఆధారపడేలా చేసింది. అయితే ఎన్డీఏకు 400 కుపైగా సీట్లు అందులో బీజేపీకి సొంతంగా 370 స్థానాలు వస్తాయని బీజేపీ ఆశించింది. కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేసినందుకు గుర్తుగా 370 సీట్లు వస్తాయని అంచనా వేసింది. దీంతో బీజేపీ సీట్లు భారీగా పడిపోవడానికి గల కారణాలపై రాజకీయ విశ్లేషకులు రకరకాల కారణాలు చెబుతున్నారు. దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదలతోపాటు అగ్నివీర్ పథకం బీజేపీని వెనక్కి లాగాయని పేర్కొంటున్నారు. సైన్యంలో అత్యధిక సంఖ్యలో యువకులు చేరే రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో బీజేపీకి సీట్లు తగ్గడం వెనుక కేంద్ర తీసుకువచ్చిన అగ్నివీర్ పథకమే అనే భావన వ్యక్తం చేస్తున్నారు. ఇక దేశంలోనే అత్యధిక లోక్‌సభ స్థానాలు ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గతంలో 2019 ఎన్నికల్లో యూపీలో ఉన్న 80 స్థానాల్లో బీజేపీ సొంతంగా 62 సీట్లు సాధించగా మిత్రపక్షం మరో 2 స్థానాలు గెలుచుకుంది. అయితే ఈసారి ఆ సంఖ్య దాదాపు సగానికి తగ్గింది. ఈసారి బీజేపీ 33 సీట్లలో మాత్రమే గెలుపొందింది. ఉత్తర్‌ప్రదేశ్‌తోపాటు దేశవ్యాప్తంగా అయోధ్య రామమందిర నిర్మాణం, బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ గురించి విస్తృత ప్రచారం చేసినా ఓటర్లు బీజేపీ వైపు చూడలేదని అర్థం అవుతోంది. ఇక అయోధ్య రామ మందిరం ఉన్న ఫైజాబాద్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి పరాజయం పాలవడం గమనార్హం. ఇక ఉత్తర్‌ప్రదేశ్ తర్వాత అత్యధికంగా 48 సీట్లు ఉన్న మహారాష్ట్రలో కూడా బీజేపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలను చీల్చి మహాఘట్‌బంధన్ ప్రభుత్వాన్ని కూల్చి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని బీజేపీ సర్కార్ ఏర్పాటు చేయడాన్ని మహారాష్ట్ర ఓటర్లు జీర్ణించుకోలేకపోయారు. దీంతో మహారాష్ట్రలో బీజేపీ కేవలం 12 స్థానాలకే పరిమితమైంది. ఇక పార్టీలు చీల్చిన ఏక్‌నాథ్ షిండే శివసేన పార్టీ 6 స్థానాలు ఎన్సీపీని చీల్చిన అజిత్ పవార్ నేతృత్వంలోని పార్టీ ఒకే ఒక్క స్థానానికి పరిమితమైంది. ఇక నరేంద్ర మోదీ, అమిత్ షాల సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో అన్ని స్థానాలను గెలుచుకుని క్లీన్ స్వీప్ చేసిన బీజేపీ పదేళ్ల తర్వాత తొలిసారి కాంగ్రెస్ తరఫున ఒక ఎంపీ లోక్‌సభలో అడుగుపెట్టబోతున్నారు.

# రతనాల సీమగా రాయలసీమ

**కర్నూలు :** రాయలసీమ రతనాల సీమ..అంటారు.. ఇప్పుడు నిజంగా రతనాల సీమ మాదిరిగానే మారింది.. సాధారణంగా మట్టిలో రాళ్లు రప్పలు కనిపిస్తుంటాయి.. కానీ.. ఇక్కడ మాత్రం వజ్రాలు కనిపిస్తుంటాయి.. అదికూడా వర్షా కాలంలో మాత్రమే.. సాధారణంగా వర్షం పడితే మట్టి వాసన రావడం సహజం.. కానీ రాయలసీమలో మాత్రం నాలుగు చినుకులు పడితే చాలు మట్టి నుంచి వజ్రాలు బయటపడతాయి. ఇప్పుడు వర్షాకాలం మొదలు కావడంతో వజ్రాల కోసం వేట ప్రారంభించారు. ముఖ్యంగా కర్నూలు ప్రాంత ప్రజలు పనులన్నింటిని వదులుకుని వజ్రాల వేటలో పడ్డారు.. ఏదైనా వజ్రం దొరకకపోతుందా..? తమ పంట పండకపోతుందా..? అదృష్టం కలిసిరాకపోతుందా?? అంటూ తమ పంటపొలాల్లో సెర్చింగ్ ఆపరేషన్ మొదలుపెట్టారు..ఈ క్రమంలోనే కర్నూలు జిల్లా జొన్నగిరిలో కొందరికి బంపర్ ఆఫర్ లెక్క.. మూడు వజ్రాలు లభ్యమయ్యాయి. ఓ వజ్రం 6 లక్షల యాభై వేలు, మరో వజ్రం 2 లక్షల యాభై వేలకు విక్రయించగా.. ఇంకో వజ్రం లక్షా ఇరవై వేలకు ఓ వ్యాపారి కొనుగోలు చేశాడు.. మూడు రోజుల్లో నాలుగు వజ్రాలు దొరకడంతో.. జొన్నగిరికి పెద్ద ఎత్తున వజ్రాల అన్వేషకులు చేరుకుని వేటను కొనసాగిస్తున్నారు.ముఖ్యంగా.. కర్నూలు జిల్లా తుగ్గిలి, జొన్నగిరి, అనంతపురం జిల్లా వజ్రకరూరులో వజ్రాల కోసం వేట కొనసాగిస్తుంటారు. ఈ ప్రాంతాలతో పాటు ఎమ్మిగనూరు, కోసిగిలోని పంటపొలాల్తోలో కూడా వజ్రాలు లభిస్తూ ఉంటాయి. దీంతో వర్షాలు కురుస్తుండటంతో వజ్రపు రాళ్లు బయటపడకపోతాయా..? తమ పంట పండకపోతుందా అంటూ వజ్రాల అన్వేషకులు ఈ ప్రాంతాల్లో సెర్చింగ్ మొదలుపెట్టారు.చిన్న రాయి దొరికినా చాలు తమ జీవితాలు మారిపోతాయనే ఆశతో జనం పెద్ద ఎత్తున సంబంధిత గ్రామాల్లో జల్లెడ పడుతున్నారు.

# పెద్దపల్లి గడ్డ కాంగ్రెస్ అడ్డ

**మంథని మున్సిపల్ చైర్మన్ రమా సురేష్ రెడ్డి.**



**మంథని ( ప్రశ్న న్యూస్)** ఇటీవల పార్లమెంట్ కు జరిగిన ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంటు స్థానం నుండి మొదటి సారి రాజకీయ అరంగేట్రం చేసి మొదటి దఫలోనే విజయాన్ని సాధించిన గడ్డం వంశీకృష్ణను కలిసి అభినందనలు తెలియజేసిన మంథని మున్సిపల్ చైర్మన్ రమ సురేష్ రెడ్డి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంటును కైవసం చేసుకోవడానికి రాష్ట్ర మంత్రివర్యులు శ్రీధర్ బాబు గారు అన్ని నియోజకవర్గాలను సమన్వయపరిచి వంశీ గెలుపును నల్లేరుపై నడకగా చేశారని పార్లమెంటు స్థానాన్ని కైవసం చేసుకోవడానికి అన్ని నియోజకవర్గాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అహర్నిశలు కష్టపడి విజయాన్ని చేకూర్చాలని వారందరికీ ఈ సందర్భంగా శ్రీధర్ బాబు గారి పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు.

# నిజామాబాద్ గడ్డ అరవింద్ అన్న అడ్డా



**ధర్పల్లి(ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో నిజామాబాద్ ఎంపీగా ధర్మపురి అరవింద్ 1,30,000 వేల ఓట్ల మెజార్టీతో గెలిచిన సందర్భంగా బిజెపి శ్రేణులు గాంధీ చౌక్ వద్ద పటాకులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఔర్ ఏక్ బార్ బిజెపి అనే నినాదంతో ముందుకెళ్లిన బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు దిశగా నడిచిన సందర్భంలో ధర్పల్లి మండల బిజెపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ధర్పల్లి మండల బిజెపి అధ్యక్షుడు లోలం గంగారెడ్డి కార్యదర్శులు మహిపాల్ యాదవ్, నల్ల పెంటయ్య, నాగయ్యోళ్ల వెంకన్న, జిల్లా నాయకుడు పాల్తి గంగాదాసు, చెలిమేల నవీన్, మేతరి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో బ్యాట్మెంటన్ టోర్నమెంట్స్

**విశాఖపట్నం(ప్రశ్న న్యూస్)** 2024 జూన్ 1 ఎజెసిఐ విశాఖ వ్యాలీ సంస్థ చాల గనం గా బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ను విశాఖపట్నంలో ఎవిఎన్ ఇండోర్ స్టేడియంలో మిక్స్ డబుల్స్, మెన్స్ డబుల్స్ నిర్వహించింది. ఈ టోర్నమెంట్ లో 160 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ ఈవెంట్‌ను జెసిఐ ఇండియా జోన్ %×ఎ% అద్యక్షులు శ్రీ సురేష్ గొంప ప్రారంబించారు, జెసిఐ విశాఖ వ్యాలీ ప్రధాని ఇంద్రజ, ఈవెంట్ యాడ్వైజర్ రామరాజు, సెక్రటరీ సతీశ్ కుమార్, ఈవెంట్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, జెసిఐ సభ్యులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. టోర్నమెంట్ విజేతలు, రన్నర్ ప్లేయర్స్ కి జెసిఐ విశాఖ వ్యాలీ ఆర్గనైజేషన్ వారు నగదు బహుమతి ట్రోఫీలు పతకాల తో సత్కరించారు.

# కేశినేని శివనాథ్‌కు ఘన స్వాగతం

**విజయవాడ** విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో కేశినేని శివనాథ్ కి ఘనస్వాగతం లభించింది. కౌంటింగ్ కేంద్రాల పర్యటన నుంచి రాగానే తల్లి ప్రసూన్నంబ ఆశీస్సులు అందుకున్నారు. మరోవైపు విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో టిడిపి శ్రేణుల ఆనందోత్సాహాలుఅంబరాన్ని అంటుతున్నాయి.

# 150 కోట్ల సీజ్

**హైదరాబాద్ :** తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలకు మే 13న ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఎన్నికల నేపథ్యంలో మార్చి 16 నుంచి రాష్ట్రంలో మోడల్ కోడ్ అమల్లోకి వచ్చింది. నాటి నుంచి నేటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల దాదాపు రూ.200 కోట్ల విలువైన నగదు, లిక్కర్, బంగారాభరణాలు, నార్కొటిక్ డ్రగ్స్ సీజ్ చేసినట్లు తెలంగాణ ఎన్నికల అధికారులు సోమవారం (జూన్ 3) విడుదల చేసిన మీడియా నివేదికలో వెల్లడించారు. వీటిని మార్చి 16 నుంచి జూన్ 3వ తేదీ మధ్యలో పోలీసులు సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకు అమల్లో ఉండనుంది.రూ. 99.16 కోట్ల నగదు, రూ. 11.48 కోట్ల విలువ చేసే మద్యం, రూ. 14.52 కోట్ల విలువైన నార్కోటిక్ డ్రగ్స్, రూ. 63.19 కోట్ల విలువ చేసే ఆభరణాలు, రూ. 11.91 కోట్ల విలువ చేసే ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు ప్రెస్ నోట్‌లో పేర్కొన్నారు. మొత్తంగా 2024 లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.200 కోట్ల 27 లక్షల 60 వేల విలువైన తాయిళాలు పట్టుబడ్డాయి. వీటిల్లో ఎస్ఎస్టీ, ఎఫ్ఎస్టీ అధికారులు రూ.50.73 కోట్లు సీజ్ చేయగా.. రాష్ట్ర పోలీసులు రూ.149.54 కోట్లు సీజ్ చేశారు. అలాగే 7,272 అక్రమ ఆయుధాలు, 20 లైసెన్స్ ఉన్న ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.కాగా 2019 ఎన్నికల్లో కేవలం 46.3 కోట్ల విలువ చేసే నగదు, బంగారు ఆభరణాలు, మద్యం పోలీసులు సీజ్ చేయగా.. ఈ ఏడాది ఎన్నికల్లో దాదాపు మూడింతలు పెరిగింది. పొలిటికల్ లీడర్లు ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు రాబట్టడానికి కాసులు రాల్చడం, మద్యం ఏరులై పారేలా చేయడం షరా మామూలే. అయితే ఈసారి అదికాస్త సృతి మించిందనే చెప్పాలి

# పంటల రక్షణ కోసం వినూత్న ఏర్పాట్లు

**నిజామాబాద్:** రైతు వ్యవసాయం చేయాలంటే ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కోవాలి. పొలంలో విత్తు విత్తింది మొదలు పంట దిగుబడి చేతికొచ్చే వరకూ రేయింబవళ్లు కంటికి రెప్పలా సంరక్షించాలి. వేలకు వేలు పోసి రైతు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ఒక వైపు అతివృష్టి, అనావృష్టి, చీడ పీడలు పంట దిగుబడిపై ప్రభావం చూపుతుంటే.. మరోవైపు ఆ పంటపై జంతువులు, పక్షుల బెడద గోరు చుట్టుపై రోకలి పోటులా మారాయి. ఈ పరిస్థితుల్లో రైతులు ఎవరికి తోచిన విధంగా వారు పంట సంరక్షణ కోసం పలు వినూత్న ఆలోచనలు చేస్తున్నారు. కొందరు కోతుల బెడదతో శబ్దాలు వినిపించేలా మైకులు ఏర్పాటు చేస్తే ఇంకొందరు పక్షుల బెడద లేకుండా పాలిథిన్ కవర్లు పంటపై ఉంచి కాపాడుకుంటున్నారు.పంటల సాగుకు వాతావరణంతో పాటు జంతువులు, పక్షుల బెడద తప్పడం లేదు. వాతావరణం అనుకులించి పంటలు సాగు చేసినా రైతులు తీవ్ర స్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలను జంతువులు, పశువులు, పక్షుల నుంచి కాపాడుకునేందుకు అనేక రకాలుగా పాట్లు పడుతున్నారు. వినూత్నంగా ఆలోచిస్తూ పంట చేనుల్లో కొత్త పరికరాలను, కొత్త కొత్త పద్ధతులను అవలంబిస్తూ పక్షులు, జంతువులు అటువైపు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ క్రమంలో భద్రాచలం ఏజెన్సీ ప్రాంతానికి చెందిన రైతులు జొన్న పంట కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడ గ్రామీణ ప్రాంతాల్లో గిరిజనులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు.వీరిలో కొందరు జొన్న పంటలను సాగుచేస్తున్నారు. అయితే ఉదయం, సాయంత్రం సమయంలో పక్షులు, కోతులు, ఇతర జీవులు పంట చేనులపై పడి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. పంటలను కాపాడుకోవాలనే లక్ష్యంతో రైతులు జొన్న కంకుల వద్ద పాలిథిన్ కవర్లు ఉంచుతున్నారు. ఈ కవర్లు ఏర్పాటు చేయడం వల్ల గాలి శబ్దానికి కవర్లు ఊగుతున్నాయి. దీని వల్ల పక్షులు పంటను నాశనం చేసే అవకాశం ఉండదని వీరి ఆలోచన. ఆ ఆలోచన అమలు చేసాక పక్షులు జొన్న పంట వైపు రావడం లేదని రైతులు చెబుతున్నారు.

# జూన్ 9న ప్రిలిమ్స్‌కు హాల్ టిక్కెట్లు

**హైదరాబాద్ :** తెలంగాణలో జూన్ 9న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష హాల్‌టికెట్లను టీజీపీఎస్సీ జూన్ 1న మధ్యాహ్నం 2 గంటలకు విడుదల చేసింది. అధికారిక వెబ్‌సైట్‌లో ప్రిలిమ్స్ పరీక్ష హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు తమ టీఎస్‌పీఎస్సీ ఐడీ, పుట్టినతేదీ వివరాలు నమోదచేసి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం.. జూన్ 9న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రూప్-1 స్క్రీనింగ్ టెస్ట్ (ప్రిలిమినరీ పరీక్ష) నిర్వహించనున్నారు. రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. గత అనుభవాల నేపథ్యంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహణకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అన్ని జాగ్రత్తలు తీసుకుంటుంది. ఈ మేరకు అభ్యర్థులకు కఠిన నిబంధనలు విధించింది. అభ్యర్థుల సౌకర్యం కోసం పరీక్షకు సంబంధించిన నియమ నిబంధనలు, నాటఖీ షీట్ నమూనాపత్రాలను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

### పరీక్ష విధానం..

మొత్తం 150 మార్కులకు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించనున్నారు. జనరల్ స్టడీస్ ఉ మెంటల్ ఎబిలిటీ నుంచి మొత్తం 150 ప్రశ్నలు అడుగుతారు. ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం రెండున్నర గంటలు (150 నిమిషాలు). ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులలో నిర్ణీత నిష్పత్తిలో మెయిన్ పరీక్షకు ఎంపికచేస్తారు.

### పరీక్ష కేంద్రాలు..

ఆసిఫాబాద్-కొమ్రంభీమ్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల-రాజన్న, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, సూర్యాపేట, నల్గొండ, భువనగిరి-యాదాద్రి, జనగాం, మేడ్చల్-మల్కాజ్‌గిరి, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ-గద్వాల్, వనపర్తి, నాగర్‌కర్నూల్.

### అభ్యర్థులకు మార్గదర్శకాలు..

టీజీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమవెంట పరీక్ష హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏదైనా ఫొటోఐడీ కార్డు తీసుకెళ్లాల్సి ఉంటుంది.

హాల్‌టికెట్‌ను ఏ4 సైజులో ప్రింట్ తీసుకోవాల్సి ఉంటుంది. దానిపై కేటాయించిన స్థలంలో తాజా పాస్‌పోర్టు ఫొటోను అతికించాలి. ఫొటో సరిగాలేని హాల్‌టికెట్లను పరిగణనలోకి తీసుకోరు. వారిని అనుమతించరు. అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్ మీద ఫొటో సరిగా లేకుంటే, అభ్యర్థి గెజిటెడ్ అధికారి లేదా విద్యార్థి గతంలో చదువుకున్న విద్యాసంస్థ ప్రిన్సిపల్ అటెస్ట్ చేసిన మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలతోపాటు కమిషన్ వెబ్‌సైట్లో పొందుపరిచిన ధ్రువీకరణ పత్రాన్ని పూర్తిచేసి ఇన్విజిలేటర్‌కు ఇవ్వాల్సి ఉంటుంది. అలా అయితేనే పరీక్షకు అనుమతిస్తారు.

అభ్యర్థులు పరీక్ష సమయానికి అరగంట ముందుగానే తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 9 గంటల నుంచే పరీక్ష హాల్‌లోకి పంపిస్తారు. ఉదయం 10 గంటలకు గేట్లను మూసివేస్తారు. నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమితించరు. ఉదయం 9.30 గంటల నుంచే అభ్యర్థుల నుంచి బయోమెట్రిక్ వివరాలు సేకరిస్తారు. హాల్‌టికెట్ మీద ఫొటో సరిగాలేని అభ్యర్థులు మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకెళ్లడం మంచిది. పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, డిజిటల్ వాచీలు, బ్లూటూత్ డివైజ్‌లు, కాలిక్యులేటర్లు, లాగ్ టేబుల్స్, రైటింగ్ పాడ్, నోట్స్, చార్టులు, ఆభరణాలు, హ్యాండ్ బ్యాగ్‌లు, పర్సులు అనుమతించరు.?అభ్యర్థులు చెప్పులు మాత్రమే వేసుకొని పరీక్షకు హాజరుకావాలి. షూ వంటివి ధరించకూడదు.విధానంలో పరీక్ష నిర్వహిస్తున్నారు, కాబట్టి అందులోని వివరాలను, సమాధానాలు బబ్లింగ్ చేయడానికి బ్లాక్ లేదా నీలం రంగు పెన్ను మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుంది. జెల్, ఇంకు పెన్ను, పెన్సిళ్లు వాడకూడదు. పత్రంలో సరైన వివరాలు బబ్లింగ్ చేయని, పెన్సిల్, ఇంక్ పెన్, జెల్ పెన్ ఉపయోగించిన, డబుల్ బబ్లింగ్ చేసిన, వైట్నర్, చాక్ పౌడర్, బ్లేడు, ఎరేజర్‌తో బబ్లింగ్ చేసే పత్రాలు చెల్లుబాటు కావు. ఓఎంఆర్ పత్రంలో ఎవరైనా తప్పులు చేస్తే, దానికి బదులుగా కొత్తది ఇవ్వరు. ఎవరైనా అభ్యర్థులు అక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి, కమిషన్ నిర్వహించే పరీక్షలు రాయకుండా డిబార్ చేస్తారు. కాబట్టి అభ్యర్థులు జాగ్రత్తగా వ్యవహరించాలి.

# అత్యధికం... అత్యల్పం... తెలుసా

**ముంబై :** ఎన్నికల్లో గెలవడం అంటే ఓ కిక్కు. అభ్యర్థులు ఒక్కోసారి అఖండ మెజారిటీతో గెలుస్తారు. కొందరేమో స్వల్ప తేడాతో ఓడిపోతారు. లోక్‌సభ ఎన్నికల చరిత్రలో ఇప్పటి వరకు ఇద్దరు నేతలు మాత్రమే సింగిల్ డిజిట్ తేడాతో గెలుపొందారు. ఇదిలా ఉంటే మరో అభ్యర్థి ఏకంగా 98 శాతం ఓట్లతో విజయం సాధించారు. ఇప్పటి వరకు ఉన్న లోక్‌సభ ఎన్నికల అత్యధిక, అత్యల్ప మెజారిటీ రికార్డు గురించి మీకు తెలుసా?బీజేపీ నాయకురాలు ప్రీతమ్ ముండే లోక్‌సభ ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. 2014లో జరిగిన ఉప ఎన్నికల్లో ఆమె అరుదైన ఘనత సాధించారు. మహారాష్ట్ర బీడ్ ఎంపీ రోడ్డు ప్రమాదంలో మరణించగా ఆ స్థానంలో ఉపఎన్నిక నిర్వహించారు. దీంతో అక్కడ ఆయన కుమార్తె ప్రీతమ్ పోటీ చేయగా రికార్డు స్థాయిలో 6.96 లక్షల ఓట్ల మెజారిటీతో ఆమె గెలుపొందారు.2019 సార్వత్రిక ఎన్నికల్లో నలుగురు అభ్యర్థులు 6లక్షలకు పైగా మెజారిటీ సాధించారు. కానీ ఎవరు ప్రీతమ్ రికార్డును చేరుకోలేదు. అయితే ఈ అభ్యర్థులంతా బీజేపీ నేతలే కావడం విశేషం. గుజరాత్‌లోని నవపరిలో బీజేపీ నేత సీఆర్ పాటిల్ 6.89 లక్షల మెజారిటీతో గెలుపొందారు.హర్యానాలోని కర్నాల్‌లో సంజయ్ భాటియా 6.56 లక్షలు, ఫరీదాబాద్ లో కృష్ణపాల్ గుజ్జర్ 6.38 లక్షలు , రాజస్థాన్ భిల్వాడాలో సుభాష్ బహేరియా 6.12 లక్షలు, 2004 ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లోని ఆరంభాఘ్‌లో సీపీఎం నేత అనిల్ బసు 5.92 లక్షల మెజారిటీతో గెలుపొందారు.భారీ మెజారిటీ సాధిస్తే గెలుపు ఏకపక్షం అవుతుంది. కానీ కొన్నిసార్లు అభ్యర్థులు స్వల్ప మెజారిటీతో విజయం సాధిస్తారు. అలా ఇద్దరు ఎంపీలు ఇప్పటి వరకు 9 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1989 లోక్ సభ ఎన్నికల్లో ఉమ్మడి ఏపీలో అనకాపల్లి కాంగ్రెస్ అభ్యర్థి కొణతల రామకృష్ణ 9 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1998లో బీహార్ రాజ్‌మహల్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి సోమ్ మరండి 9 ఓట్ల తేడాతో గెలుపొందారు.

# ఈవీఎంలలో అవకతవకలున్నాయి

**విశాఖపట్నం** లోక్ సభ ఎన్నికల్లో విశాఖ పట్నం నుంచి, అసెంబ్లీ ఎన్నికల్లో గాజువాక నుంచి పోటీ చేసిన కుండ గుర్తుపై పోటీ చేసిన కేఏ పాల్కి షాక్ తగిలింది.ఉదయం 11.15 గంటల వరకు కేఏ పాల్కు గాజువాకలో 394 ఓట్లు, విశాఖలో 1,190 ఓట్లు పోలయ్యాయి. దీంతో కేఏ పాల్ నోటాతో పోటీ పడుతున్నారు.తన కొచ్చిన ఓట్లపై కేఏపాల్ కీలక వ్యాఖ్యలు చేశారు.రీపో లింగ్ పెట్టాలని డిమాండ్ చేసిన ఆయన ... ఈ వివిఎల విషయంలో అవకతవకలు జరిగా యని ఆరోపించారు.జరిగిన ఎన్నికలు అవినీతి ఎన్నికలు అంటూ వ్యాఖ్యానిచ్చారు.

# మంచి చేయడమే లక్ష్యం

**విశాఖపట్నం** ఏపీ ప్రజలకు మంచి చేయాలన్నదే తమ లక్ష్యం అని అనకాపల్లి లోక్సభ అభ్యర్థి సీఎం రమేష్ అన్నారు. విధ్వాంసానికి గురైన ఏపీని ఎలా బాగు చేయాలన్నదే తమ ఆలోచన అని తెలిపారు. అప్పుడే కొందరు పారిపోవాలని చూస్తున్నారని, వారికి లుక్ ఔట్ నోటీసులు ఇవ్వాలన్నారు. గెలిచిన వారి నుంచి ఫోన్లు వస్తున్నాయని, వారిని రానిచ్చే పరిస్థితి లేదని సీఎం రమేష్ పేర్కొన్నారు. అనకాపల్లి లోక్సభ నుంచి సీఎం రమేష్ గెలుపు దాదాపుగా ఖా యం అయింది.ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి జగన్ విధ్వంసం సృష్టించారు. రాజధా నిని విధ్వంసం చేసేశారని,రుషికొండను విధ్వంసం చేశారని చెప్పారు.

# ఇచ్చిన హామీలను అమలు చేస్తా

**విశాఖపట్నం** విశాఖలో కూటమి అభ్యర్థులు మంచి మెజార్టీతో దూసుకుపోతున్నారు.విశాఖ దక్షిణంలో వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గెలుపు గ్యారెంటీ అని అంతా భావించారు. కానీ ఇక్కడ కూడా అంచనాలు తలకిందులయ్యాయి. జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ వేలకు పైగా మెజార్టీతో గెలుపు ఖాయం చేసుకున్నారు.దీనిపై వంశీక్రిష్ణ శ్రీనివాస్ స్పందించారు.ఇచ్చిన హామీలను అమలు చేస్తామని తెలిపారు.

# డోన్ అడ్డా "కోట్ల" దే

**డోన్** డోన్ అడ్డా కోట్ల వారి అడ్డా అనీ నిరూపింకొన్నారు,డోన్ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ మంగళవారం ఉదయం మొదలుఅయ్యింది, అయినప్పటి మొదటి రౌండ్ నుంచే కూటమి అభ్యర్థి కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మెజారిటీ తో ఉన్నారు, మొత్తం 21రౌండ్స్ కౌంటింగ్ పూర్తికాగా 6450 ఓట్లు తో వైసీపీ అభ్యర్థి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పైన మెజారిటీ విజయం సాధించారు, మాజీ యం యల్ ఏ కోట్ల సుజాతమ్మ చేసిన కృషి డోన్ కోట్ల వారి అడ్డా అని నిరూపించారు,ఇటు రాష్ట్రాము లో కూటమి ప్రభుత్వం, కేద్రం లో యన్ డి ఏ ప్రభుత్వం ఏర్పడం, కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి విజయం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేసారు, పట్టణం లో తెలుగుదేశం కార్యకర్తలు, జన సైనికులు,బాణా సంచారం చేసి,స్వీట్స్ పంచారు,

# మంగళగిరిలో విజయం సాధించిన నారా లోకేష్





టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఘనవిజయం సాధించారు. గత ఎన్నికల్లో మంగళగిరి నుంచి పోటీ చేసిన నారా లోకేష్ ఓటమి పాలయ్యారు. ఎక్కడ పోగొట్టుకున్నది అక్కడే తెచ్చుకోవాలని అక్కడ నుంచే పోటీ చేసారు. గత ఐదేళ్లుగా నారా లోకేష్ పై అనేక విమర్శలు వస్తున్నాయి. వైసీపీ నేతలు తనను రకరకాలుగా అవమానించారని, మంగళగిరిలో ఓడిపోయారని అన్నారు. వాటన్నింటికీ నారా లోకేష్ సక్సెస్‌తో సమాధానం చెప్పారు.



# రాజోలులో జనసేన ఘన విజయం



రాజోలు నియోజకవర్గంలో మరో సారి జనసేన గెలిచి తమ స్థానంను సుస్థిరం చేసుకుంది.వైసిపి అభ్యర్థి గొల్లపల్లి సూర్యరావుపై జనసెన అభ్యర్థి దేవ వరప్రసాద్ 37,935 ఓట్లు మెజారీటితో గెలిపొందారు.ఇప్పటి వరకు రాజోలు నియోజకవర్గంలో ఇంతటి బారీ విజయం దక్కలేదు.2004 కాంగ్రెస్ ఎంఎల్ఎ అల్లూరి కృష్ణంరాజు 28,018 ఓట్లు మెజారిటితో గెలిపొందారు.మరలా 20 సంవత్సరాల తరువాత ఆ రికార్డ్ ను రాజోలు జనసేన అభ్యర్థి దేవా వరప్రసాదరావు తిరగరాశారు.

# పేర్ని నాని ఇంటి దగ్గర ఉద్రిక్తత

**మచిలీపట్నం** మాజీ మంత్రి పేర్ని నాని ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఎస్బీ సిఐ రమణ అత్యుత్సాహం చూపించారు.దాంతో జనసేన నాయకులు మరియు పోలీసుల మధ్య ఘర్షణ చేలరేగింది. జనసేన కార్యకర్తను రక్తం వచ్చేల పోలీసులు కొట్టారు. దాంతో కోపోద్రిక్తులైన ఎన్డీయే కూటమి నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.గాయపడి వ్యక్తిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితులు విషమించకుండాపోలీసులు నాయకులను సర్దుబాటు చేసి పంపించివేసారు.

# మొక్కులు చెల్లించుకున్న టీడీపీనేతలు

**కుత్బుల్లాపూర్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెదేపా, జనసేనా, బిజెపి కూటమి అధిక సీట్లలో మెజార్టీ సాధిస్తుండటంతో శ్రీ కట్ట మైసమ్మ తల్లి దేవాలయం లో కుత్బుల్లాపూర్ తె.దే.పా అభిమానులు మొక్కు చెల్లించుకున్నారు. సూరారం కట్ట మైసమ్మ తల్లి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి కి 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించారు...అలాగే శ్రీ కార్యాలయం నుండి జీడిమెట్ల గ్రామం వరకు ర్యాలీ నిర్వహించి బాణసంచా కాల్చి సంబరాలు చేసుకునన్నారు.

## మోడీ,షాలకు ఫోన్ చేసిన చంద్రబాబు నాయుడు

**విజయవాడ** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా లకుటీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఫోన్ చేసారు. ఎన్డిఎ కూటమి అత్యధిక సీట్లు సాధించడంపై ఇద్దరికీ శు భాకాంక్షలు తెలిపారు. ఏపీలో ఎన్డీయే కూటమి ఘన విజయంపై చంద్రబాబు నాయుడుకు ప్రధాని మోదీ, అమిత్ షా శుభాకాంక్షలు తెలిపారు. వారికి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు.

# ఉద్యోగులను ఉపాధ్యాయులను వేధించిన ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంది.

**-యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి లక్ష్మీరాజా**

**బద్వేలు** గత ప్రభుత్వం ఉద్యోగులను ఉపాధ్యాయులను వే వేధింపులకు గురి చేసినందుకు తగిన మూల్యం చెల్లించుకుందన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడే ప్రభుత్వం విద్యారంగ ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక కృషి చేయాలనిరాష్ట్ర కార్యదర్శి బి. లక్ష్మి రాజా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్ పాలెం మహేష్ బాబు కోరారు. గత ప్రభుత్వం నిరంతరం ఉపాధ్యాయులను ఉద్యోగులను వేధించడమే పనిగా పెట్టుకొని పని చేసిందన్నారు. ఉపాధ్యాయుల పట్ల గత ప్రభుత్వం చులకన భావం ప్రదర్శించడం అధికారులు మానసికంగా ఉద్యోగులను ఉపాధ్యాయులను వేధించడం జరిగిందన్నారు.గత ప్రభుత్వం తాము అమలు చేసే విధానాలపైన ప్రశ్నించే అధికారం ఉద్యోగ ఉపాధ్యాయులకు లేదని ప్రజలు మా వైపు ఉన్నారని వారి నిర్ణయం తీసుకొని మా గెలుపోటములుంటాయని అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులను వేధించినందుకే ఈ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంది. ప్రస్తుతం ఏర్పడబోయే నూతన ప్రభుత్వం ప్రభుత్వ ప్రాథమిక విద్యను చిన్నాభిన్నం చేసిన జీవో 117 ను రద్దుచేసి ఒకటి నుండి ఐదు వరకు ప్రాథమిక విద్య కొనసాగేటట్లు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

## బనగానపల్లె ఎమ్మెల్యేగా బీసీ జనార్దన్ రెడ్డి 24,769 ఓట్ల మెజార్టీతో గెలుపు...



**కొలిమిగుండ్ల** బనగానపల్లె నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా బీసీ జనార్దన్ రెడ్డి 24,769 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు... ఓట్ల లెక్కింపులో రౌండ్ రౌండ్ కు సైకిల్ పార్టీ భారీ మెజార్టీతో దూసుకుపోతున్నది. బనగానపల్లె ఎమ్మెల్యేగా రెండవసారి బీసీ జనార్దన్ రెడ్డి గెలుపొందడం పట్ల నియోజకవర్గంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు కలిసి పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పై తీవ్ర వ్యతిరేకత ఉందని ఈ విషయాన్ని ఆ పార్టీ వాళ్లు గమనించలేకపోయారని చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి బాగా చొచ్చుకొని పోవడంతోనే ప్రజలంతా తెలుగుదేశం పార్టీకి గంపగుత్తగా ఓట్లు వేసి గెలిపించారని బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బద్వేల్ అసెంబ్లీలో వైకాపా అభ్యర్థి డాక్టర్ సుధ విజయం

**- 20,500 ఓట్ల మెజార్టీ తో గెలుపు**



**బద్వేలు** బద్వేలు అసెంబ్లీ స్థానంలో వైకాపా అభ్యర్థి డాక్టర్ సుధ విజయం సాధించారు ఆమె సమీప ప్రత్యర్థి బిజెపి అభ్యర్థి బొజ్జ రోశయ్యపై 20,500 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు కాంగ్రెస్ అభ్యర్థి విజయ జ్యోతి కి డిపాజిట్ దక్కలేదు బద్వేలు అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 14 మంది పోటీ చేశారు

# జగన్ అడ్డాలో టీడీపీ ప్రభంజనం

**కడప** జగన్ అడ్డాలో టీడీపీ ప్రభంజనం సృష్టించింది. కడపలో వైసీపీ అభ్యర్థి అంజాద్ బాషా పై మాధవి రెడ్డి 17, 191 ఓట్ల అధిక్యతతో విజయం సాధించారు. మైదుకూరులో వైసీపీ అభ్యర్థి రఘురామి రెడ్డిపై టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ 21,299ఓట్ల అధిక్యతతో గెలుపొందారు. కమలాపురంలో వైసీపీ అభ్యర్థి రవీంద్రనాద్ రెడ్డి పై టీడీపీ అభ్యర్థి చైతన్య రెడ్డి 23,443ఓట్ల అధిక్యత తో విజయం సాధించారు. అలాగే జమ్మలమడుగులో వైసీపీ అభ్యర్థి సుధీర్ రెడ్డి పై బీజేపీ అభ్యర్థి ఆదినారాయణ రెడ్డి 18,225 ఓట్ల అధిక్యత తో గెలుపొందారు. ప్రొద్దుటూరులో వైసీపీ అభ్యర్థి రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి పై టీడీపీ అభ్యర్థి వరదరాజుల రెడ్డి 22,839ఓట్ల అధిక్యతతో గెలుపొందారు. బద్వేల్ లో బీజేపీ అభ్యర్థి రోశన్న పై వైసీపీ అభ్యర్థి డాక్టర్ సుధా 20,669ఓట్ల అధిక్యతతో విజయం సాధించారు.

# తెలుగుదేశం పార్టీ చరిత్రలో కనీవినీ ఎరుగని విజయం

**- టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు దేశాయి మాధవరావు**



**నందవరం** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి దిమ్మతిరిగి, మైండ్ బ్లాక్ అయ్యే విధంగా ఆంధ్రప్రదేశ్ యావత్తు ప్రజానీకం తీర్పు ఇచ్చింది. ఐదేళ్ళపాటు అరాచక పాలన,విధ్వంసం,దోపిడీ, వ్యవస్థలను సర్వనాశనం చేసిన జగన్ మోహన్ రెడ్డి పార్టీ చరిత్రలో మరచిపోలేని విధంగా ఆంధ్రప్రదేశ్ లో పూర్తిగా తుడిచిపెట్టుకు పోయింది. ఎన్డీయే కూటమికి పట్టంకట్టిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు.అదేవిధంగా కర్నూలు జిల్లాలో తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు దేశాయి మాధవరావు ఆధ్వర్యంలో 7 అసెంబ్లీ స్థానాల్లో ఇప్పటికే 5స్థా నాల్లో విజయం సాధించింది అని నందవరం మండల నాయకులు సంబరాలు చేసుకుంటు న్నారు.ఈకార్యక్రమంలో సుధా వెంకటేష్ ,శీను ,వలి, బసవరాజు ,మల్లయ్య ,తదితరులు పాల్గొన్నారు.

# గాయపడిన రాష్ట్రాన్ని గాడిన పెట్టండి

చరిత్రలో అరుదైన విజయాన్ని అందుకున్న టిడిపిచీఫ్ చంద్రబాబుకు మెగాస్టార్ చిరంజీవి అభినందనలుతెలిపారు. 'ఈ మహత్తర విజయం రాష్ట్రానికి గత రాజకీయ వైభవం తిరిగి తెచ్చిన మీ దక్షతకు నిదర్శనం.దురంధరులైన మీరు, పవన్, ప్రధాని మోదీపై ప్రజలు కనపరచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటారని ఆశిస్తున్నా.రాజధాని లేని, గాయపడిన రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టి నంబర్-1గా తీర్చిదిద్దుతారని ఆశిస్తున్నా' అని ట్వీట్ చేశారు.

# తెలుగుదేశం పార్టీ గెలుపుతో మండల వ్యాప్తంగా అంబరాన్నంటిన సంబరాలు

**సి.బెళగల్** సి. బెళగల్ మండల వ్యాప్తంగా తెలుగుదేశం శ్రేణుల సంబరాలు అంబరానంటాయి. రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ గెలుపుతో సి.బెళగల్ మండలంలోని 23 గ్రామాలలో ని ప్రజలు తెలుగుదేశం కార్యకర్తలు నాయకులు బానిసంచ కాలుస్తూ మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం శ్రేణులు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి రాష్ట్రానికి ఏమి లేదని అందుకే రాష్ట్ర ప్రజలు కూటమి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నాల్గవసారి అఖండ మెజారిటీతో చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రిగా గెలిపించారని తెలిపారు.అలాగే కోడుమూరు సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తరఫున పోటీచేసిన బొగ్గులు దస్తగిరిని అఖండమైన మెజారిటీతో గెలిపించిన కోడుమూరు నియోజకవర్గ ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో సి. బెళగల్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ దేవరాజు,అమర్నాథ్ , పొలకల్ డాక్టర్ తిమ్మప్ప, మాజీ జెడ్పీటీసీ చంద్ర శేఖర్,గోవింద్ గౌడ్, ఎంపిటిసి ఈరన్న, ధనుంజయ, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, ముదుమాల ఆర్. పౌలు, యేసన్న,పాల్గొన్నారు.

# ఇది ప్రజా విజయం

**తాడేపల్లిగూడెం** జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి రాష్ట్రవ్యాప్తంగా కూటమి సాధించిన విజయం ప్రజా విజయమని జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఓటింగ్ సరళి పరిశీలించిన ఆయన మంగళవారం కూటమి విజయంపై స్పందించారు. తనకు తాడేపల్లిగూడెం నియోజకవర్గం లో రికార్డు స్థాయిలో 60 వేల పైచిలుకు మెజారిటీ అందించిన తాడేపల్లిగూడెం నియోజవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. గతంలో తాను మున్సిపల్ చైర్మన్.గా పనిచేసిన సమయంలో ఏ విధంగా అయితే ప్రజలకు నిస్వార్ధంగా సేవలందించానో అదే రీతిన తన పాలన ఉంటుందన్నారు. తనకు ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు, సహకరించిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు , నియోజకవర్గ టిడిపి బిజెపి జనసేన నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలుతెలియజేశారు. రాబోయే ఐదేళ్లు ప్రజారంజక పాలన దిశగా కూటమి పనిచేస్తుందన్నారు. జగన్మోహన్ రెడ్డి రాక్షస పాలన తో కడుపు మండిన ప్రతి ఒక్కరు ఓటు రూపంలో జగన్ను మట్టి కరిపించారన్నారు. ప్రజలు డబ్బులకు లొంగరని నిజాయితీగా పనిచేసే నాయకులను అందలం ఎక్కిస్తారని ఎన్నికల్లో రుజువు చేశారన్నారు.

# సంబరాల్లో కూటమి కార్యకర్తలు

**విశాఖపట్నం** ఏపీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. విజ యం దిశగా కూట మి అభ్యర్థులు దూసుకెళ్తున్నారు. ఈ సందర్భంగా కూటమి విజయంతో అభ్యర్థులు, నాయకు లు, కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు.దీంట్లో బాగంగా విశాఖ టిడిపి కార్యాలయంలో టిడిపి శ్రేణులు సంబరాల్లో మునిగితేలారు. అత్యదిక మెజారిటీ దిశగా టిడిపి దూసుకెళ్లడంపై హర్షం వ్యక్తం చేస్తు న్నారు.ఎన్నికల ఫలితాలు టీడీపీకి ఊహకందని విధంగా రావడంతో వారం తా సంబరాల్లో మునిగిపో యారు. అధికారం దిశగా ప్రభంజనం సృష్టిస్తుండటంతో శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేసింది. జై టీడీపీ. జైజై చంద్రన్న. సీఎం చంద్రబాబు అంటూ పార్టీ శ్రేణులు నినాలు చేశారు. డ్యాన్సులతో ఉత్సాహంగా గడిపారు.

# కేంద్రంలో కీలకం కానున్న టీడీపీ

**విజయవాడ :** ఎగ్జిట్ పోల్స్ అంచనాలన్నీ తారుమారయ్యాయి. కేంద్రంలో అతికష్టం మీద ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఎన్డీఏ కూటమి, ఇండియా కూటమికి మధ్య ఎవరు ఊహించని రీతిలో పోటీ నెలకొంది. 400 సీట్లు కచ్చితంగా సాధిస్తామన్న బీజేపీ నేతల అంచనాలు తారుమారయ్యాయి. 300 సీట్లు దాటేందుకు కూడా బీజేపీకి కూటమి అష్టకష్టాలు పడుతోంది.ప్రభుత్వ ఏర్పాటులో ఉత్తరప్రదేశ్ చాలా కీలకం. అక్కడ 80 ఎంపీ సీట్లు ఉన్నాయి. అయితే యూపీలో చాలా దారుణమైన పరిస్థితుల్లో బీజేపీ ఉంది. యూపీలో మెజారిటీ సీట్లను ఇండియా కూటమి కైవసం చేసుకుంటోంది. సమాజ్‌వాదీ పార్టీ సత్తా చాటింది. ఇండియా కూటమి అక్కడ 45 సీట్లకు పైగా ఆధిక్యంలో ఉంది. పార్టీలో అంతర్గత కలహాలు పార్టీ కొంపముంచాయి. గత ఎన్నికల్లో 62 సీట్లలో గెలిచిన బీజేపీ ఈసారి మాత్రం 30కి పైగా సీట్లలో మాత్రమే ఆధిక్యంలో ఉంది.బిహార్‌లో మాత్రం ఎన్డీఏ కూటమికి కాస్త ఊరట లభించింది. ఇండియా కూటమిపై అక్కడ బీజేపీ కూటమికి స్పష్టమైన ఆధిక్యత లభించింది. వాస్తవానికి ఇక్కడ కూడా ఇండియా కూటమికి ఆధిక్యం లభిస్తే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం దక్కేది. కాంగ్రెస్ మాత్రం ఈ ఎన్నికల్లో అనూహ్యంగా పుంజుకుంది. 2024 ఎన్నికల తరువాత 100 సీట్లకు చేరువలో కాంగ్రెస్ ఉంది. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ దేశవ్యాప్త ప్రచారం పార్టీకి బాగా కలిసివచ్చింది. గతంలో పోలిస్తే మైనారిటీ ఓట్లను తమవైపు తిప్పుకోవడంలో కాంగ్రెస్ నేతలు సక్సెసయ్యారు. ముఖ్యంగా బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారన్న ప్రచారం బాగా కలిసి వచ్చింది. యూపీ , మహారాష్ట్రలో ఇండియా కూటమి ఆధిక్యం బీజేపీ కొంపముంచింది. ఉద్ధవ్ వర్గం తమదే అసలైన శివసేన నిరూపించుకుంది. ఉత్తరాది రాష్ట్రాల్లో రైతుల ఆందోళనలు బీజేపీ కొంపముంచినట్టు ఎన్నికల ఫలితాలు చెబుతున్నాయి. పంజాబ్ , హర్యానా , యూపీ , రాజస్థాన్‌లో బీజేపీ గ్రాఫ్ తగ్గడానికి రైతుల వ్యతిరేకతే ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు.ఇక కొత్తగా ఏర్పాటయ్యే ఔఆం ప్రభుత్వంలో టీడీపీ, జేడీయూ కీలక పాత్ర పోషించబోయే అవకాశం కనిపిస్తుంది. ఎన్డీయేలో రెండవ అతి పెద్ద పార్టీగా టీడీపీ పాగా వేసే సూచనలు ఉన్నాయి. ఈ క్రమంలో కేంద్రంలో కూడా టీడీపీ చక్రం తిప్పే చాన్స్ ఉంది.

# పొంగులేటి వియ్యంకుడు రికార్డ్

**ఖమ్మం:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. మంగళవారం నిర్వహించిన లెక్కింపులో కాంగ్రెస్ పార్టీ బోణి కొట్టింది. ఖమ్మం పార్లమెంటు స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ సహాయం రఘురామిరెడ్డి 3.5 లక్షలకు పైగా ఓట్ల తేడాతో తన సమీప భారత రాష్ట్ర సమితి అభ్యర్థి నామ నాగేశ్వరరావు పై విజయం సాధించారు. చివరి నిమిషంలో టికెట్ దక్కించుకున్నప్పటికీ.. భారీ మెజారిటీ సాధించి రఘురామిరెడ్డి చరిత్ర సృష్టించారు. రఘురామిరెడ్డి సినీ హీరో వెంకటేష్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వియ్యంకుడు. ఎన్నికల సమయంలో నిర్వహించిన ప్రచారంలో వెంకటేష్ సందడి చేశారు.

తన వియ్యంకుడి తరపున ఖమ్మంలో క్యాంపెనింగ్ లో పాల్గొన్నారు. మరోవైపు శ్రీనివాసరెడ్డి కూడా రఘురామిరెడ్డి విజయంలో అన్ని తానై వ్యవహరించారు.ఖమ్మం పార్లమెంట్ స్థానంలో 3.5 లక్షల మెజారిటీ ఓట్లతో విజయం సాధించి సరికొత్త చరిత్ర సృష్టించారు రఘురామిరెడ్డి. ఈ పార్లమెంటు స్థానంలో 15 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ మళ్లీ విజయం సాధించింది. 2009లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన నామ నాగేశ్వరరావు ఎంపి గా గెలిచారు. 2014లో జరిగిన ఎన్నికల్లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వైసీపీ తరఫున పోటీ చేసి ఎంపీగా గెలిచారు. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి తరపున పోటీ చేసి నామా నాగేశ్వరరావు విజయం సాధించారు. మళ్లీ ఇన్నాళ్లకు కాంగ్రెస్ పార్టీ తరపున రఘురామిరెడ్డి పోటీ చేసి ఎంపీగా గెలిచారు. 3.5 లక్షల ఓట్ల తేడాతో విజయం సాధించి.. సరికొత్త రికార్డు సృష్టించారు.ఈ పార్లమెంటు స్థానంలో భారత రాష్ట్ర సమితి తరఫున నామ నాగేశ్వరరావు, భారతీయ జనతా పార్టీ తరఫున తాండ్ర వినోద్ రావు పోటీ చేశారు.. అయితే వీరెవరు కూడా రఘురామిరెడ్డికి కనీస పోటీ ఇవ్వలేకపోయారు. ఈ జిల్లా నుంచి తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భట్టి విక్రమార్క మంత్రులుగా ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో.. రఘురామిరెడ్డి విజయాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. చివరి నిమిషంలో అభ్యర్థిని ఖరారు చేసినప్పటికీ.. రఘురామిరెడ్డి విజయం కోసం అహర్నిశలు పాటుపడ్డారు. విభేదాలను పక్కనపెట్టి ఏకపక్ష విజయం దక్కేలా చూశారు. ఇప్పటివరకు కాంగ్రెస్ గెలుచుకున్న ఎంపీలలో రఘురామిరెడ్డిదే హైయెస్ట్ మెజారిటీ కావడం విశేషం

# టీడీపీ ప్రభంజనంలో కొట్టుకుపోయిన వైసీపీ

**తిరుపతి :** రాయలసీమలోను టిడిపి ప్రభంజనం కొనసాగింది. చివరకు జగన్ అడ్డా కడపలో సైతం మెజారిటీ స్థానాల దిశగా కూటమి ముందుకెళ్తోంది. వైసీపీ ఆవిర్భావం నుంచి రాయలసీమ వెన్నుదన్నుగా నిలుస్తూ వచ్చింది. 2014 ఎన్నికల్లో సైతం ఆ పార్టీదే విజయం. 2019 ఎన్నికల్లో 52 స్థానాలకు గాను 49 స్థానాల్లో వైసిపి విజయం సాధించింది. కుప్పం నుంచి చంద్రబాబు, హిందూపురం నుంచి బాలకృష్ణ, ఉరవకొండ నుంచి పయ్యావుల కేశవ్ మాత్రమే గెలుపొందారు. కానీ ఈసారి సీన్ రివర్స్ అయ్యింది. కూటమి ప్రభంజనానికి రాయలసీమలో ఫ్యాన్ రెక్కలు విడిచింది. కేవలం కడపలోని పులివెందుల, బద్వేలు, రాయచోటిలో మాత్రమే ఆ పార్టీముందంజలో నిలిచింది.రాయలసీమలో చంద్రబాబును ఓడిస్తామని జగన్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ బాధ్యతను సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అప్పగించారు.

అటు హిందూపురంలో బాలకృష్ణను సైతం ఓడిస్తామని పెద్ద ఎత్తున ప్రకటనలు చేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరు ను వదిలి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆ రెండు నియోజకవర్గాలపైనే ఎక్కువ దృష్టి పెట్టారు. కానీ కుప్పం నుంచి చంద్రబాబు గెలుపు బాటలో ఉన్నారు. హిందూపురం నుంచి బాలకృష్ణ కూడా గెలవనున్నారు. ఎటొచ్చి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఓటమి బాటలో ఉండడం గమనార్హం.వాస్తవానికి రాయలసీమ అంటేనే వైసిపి.. వైసిపి అంటేనే రాయలసీమ అన్నంత పరిస్థితి ఉండేది. 2014 ఎన్నికల్లో ఉత్తరాంధ్ర, గోదావరి, కోస్తా ఆంధ్రాలో టిడిపి స్పష్టమైన మెజారిటీ దక్కించుకున్నా.. రాయలసీమ విషయానికి వచ్చేసరికి చతికిల పడింది. మెజారిటీ స్థానాలను వైసీపీ దక్కించుకుంది. 2019లో అయితే క్లీన్ స్వీప్ చేసింది. ఈసారి కూడా రాయలసీమలో అత్యధిక స్థానాలు గెలుచుకొని.. మిగతా ప్రాంతాల్లో గెలిచే స్థానాలతో మ్యాజిక్ ఫిగర్ దాటుతానని అంచనా వేసింది. కానీ ఆ అంచనాలు తప్పాయి. రాయలసీమలో సీన్ రివర్స్ అయ్యింది. వైసీపీకి దారుణ ఓటమి మిగిలింది.

# కలిసి రాని రామమందిరం..

**లక్నో:** లోక్‌సభ ఎన్నికల వేళ ఉత్తరప్రదేశ్‌పై దేశంలోని ప్రధాన పార్టీలు ప్రత్యేక దృష్టి పెడతాయి. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేనన్ని సీట్లు యూపీలో ఉంటాయి. ఆ రాష్ట్రంలోని 80 సీట్లలో వీలైనన్ని ఎక్కువగా గెలిస్తే దేశంలో సత్తా చాటొచ్చని భావిస్తాయి.అటువంటి యూపీలో ఆధిక్యత సాధించాలని బీజేపీ చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేసింది. అన్నింటి కన్నా ముఖ్యంగా ఆ రాష్ట్రంలోని అయోధ్యలో రామమంది నిర్మాణం బీజేపీని ఎన్నడూ లేనన్ని సీట్లు తెచ్చిపెడుతుందని అందరూ భావించారు. శతాబ్దాల హిందువుల కల అయోధ్య రామమందిరం.ఆ కల నెరవేరినా, యూపీలోని హిందువులు సంబరాల్లో మునిగి తేలినా బీజేపీకి ఓట్లు రాబట్టడంలో మాత్రం ఆ వ్యూహం పనిచేయలేదు. సీన్ రివర్స్ అయింది. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ గట్టి సవాలును ఎదుర్కొంటోంది.సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ 'భారత కూటమి' 44 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా, ఎన్డీఏ మాత్రం 35 స్థానాల్లోనే ప్రభావం చూపగలిగింది. 2014, 2019 ఎన్నికల్లో ఏకంగా 71, 62 స్థానాలతో సత్తాచాటిన ఎన్డీఏ ఈ సారి రామమందిరాన్ని నిర్మించిన ఘనత ఉన్నప్పటికీ గతంలో కంటే చాలా తక్కువ స్థానాల్లో గెలుస్తుండడం గమనార్హం.లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో రామమందిరం అంశం నిర్ణయాత్మకంగా మారుతుందని బీజేపీ అనుకుంది. 1980 దశకం నుంచి బీజేపీ ఎన్నికల్లో ఆ అంశంపై హామీలు ఇస్తూనే ఉంది. చివరకు అయోధ్యలో రామ మందిర నిర్మాణ కల ప్రధాని మోదీ హయాంలో నెరవేరింది. దీంతో ఈ సారి బీజేపీకి 75 స్థానాలకు మించి వచ్చినా ఆశ్చర్యం లేదని బీజేపీ మద్దతుదారులు భావించారుయూపీలోనే కాదు దేశం మొత్తం రామమందిర నిర్మాణ ప్రభావం ఉంటుందని అనుకున్నారు. దేశంలోనూ ఒంటరిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంత మెజారిటీ బీజేపీకి రాలేదు. సమాజ్ వాదీ పార్టీకి చెందిన అఖిలేశ్ యాదవ్ 'యూపీ బిడ్డ' అనే నినాదమే బాగా ప్రభావం చూపింది. ఇక యూపీలో మాయావతికి చెందిన బీఎస్పీ ఏ మాత్రం ప్రభావం చూపించలేకపోతోంది

# భారీ విజయంతో కంగనా




**సిమ్లా :** ప్రస్తుతం దేశవ్యాప్తంగా 2024 లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. హిమాచల్ ప్రదేశ్ మండి నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా రాజకీయ అరంగేట్రం చేసిన బాలీవుడ్ నటి కంగనా రనౌత్ ఓట్ల లెక్కింపులో ముందజలో ఉన్నారు. ఎన్నికల కమిషన్ తాజా గణాంకాల ప్రకారం.. 70వేల ఓట్లతో కంగనా భారీ ఆధిక్యం సాధించారు. దాంతో 37 ఏళ్ల బాలీవుడ్ స్టార్ భారీ విజయం దిశగా కొనసాగుతున్నారు.ఈ సందర్భంగా కంగనా మీడియాతో మాట్లాడుతూ.. ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి విక్రమాదిత్య సింగ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇప్పుడు మీరే బ్యాగ్‌లు సర్దుకుని బయలుదేరాలని విక్రమాదిత్యను ఆమె ఎద్దేవా చేశారు. మొదటినుంచే బాలీవుడ్ క్వీన్ తన విజయంపై ధీమాగా ఉన్నారు. ఇప్పుడు అన్నట్టుగానే ఈ ఎన్నికల్లో తన విజయాన్ని దాదాపుగా ఖాయం చేసుకున్నారు.ఎన్నికల ప్రచారం సమయంలో ప్రత్యర్థి విక్రమాధిత్య కంగానాను ఉద్దేశించి పలు విమర్శలు చేశారు. ఎన్నికల తర్వాత మండిని వదిలిపెట్టి ముంబైకి బ్యాగ్ సర్దుకునిఆమె బయల్దేరిపోతుందని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను కంగనా తీవ్రంగా వ్యతిరేకించారు. "ఒక మహిళ గురించి ఇంత తక్కువ మాట్లాడటం వల్ల కలిగే పరిణామాలను వారు చవిచూడాల్సి వస్తుంది. ఎన్నికల ఫలితాల్లో ఆధిక్యంతో ఈరోజు స్పష్టమవుతోంది. కూతుళ్లకు జరిగిన అవమానాలను మండి పట్టించుకోలేదు"అని రనౌత్ అన్నారు.2014, 2019లో అన్ని లోక్‌సభ స్థానాలను గెలుచుకున్న బీజేపీ.. మూడు ఎన్నికల ర్యాలీల తర్వాత అన్ని పార్లమెంటు స్థానాలను నిలుపుకుంది. అలాగే, ఆరు అసెంబ్లీ స్థానాల్లోనూ ప్రధాని నరేంద్ర మోదీ 'చరిష్మా'నే గెలిపించింది. అయితే, కాంగ్రెస్ తన బలమైన ఓటు బ్యాంకుపై కన్నేసింది. 2.5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్‌ను ఆ రాష్ట్ర సీఎం సుఖ్‌విందర్ సింగ్ సుఖూ నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేసింది. ఏదిఏమైనప్పటికీ, ఈ మండి నియోజకవర్గంలో కంగనా రనౌత్ భారీ ఆధిక్యం సాధించడంతో బీజేపీ గెలుపు ఖాయమేనని స్పష్టమవుతోంది.

# అభివాదంచేసిన పవన్ భార్య

**హైదరాబాద్:** ఏపీ ఎన్నికల్లో కూటమి విజయం సాధిస్తుంది. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నాయి. ఇన్నేళ్ల నిరీక్షణకు ఫలితంగా జనసేన పోటీ చేసిన అన్ని స్థానాల్లో లీడింగ్ తో దూసుకెళ్తుంది. జనసేన అధినేత, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కూడా పిఠాపురంలో భారీ మెజారిటీతో గెలిచారు. దీంతో పవన్ అభిమానులు, జనసేన కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు హైదరాబాద్ లోని పవన్ నివాసం బయట అభిమానులు, కార్యకర్తలకు వచ్చి సెలబ్రేషన్స్ చేస్తుండటంతో పవన్ భార్య అన్నా లేజనోవా, తనయుడు అకిరా నందన్ బయటకు వచ్చి అభిమానులకు అభివాదం చేశారు. పవన్ కళ్యాణ్ ని గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. దీంతో ఈ వీడియో వైరల్ గా మారింది.

## పవన్ క్లీన్ స్వీప్

ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ప్రభంజనం సృష్టిస్తోంది. కూటమి అభ్యర్థులు విజయ దుందుభి మోగిస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన జనసేన అభ్యర్థి పవన్ కల్యాణ్ ఘన విజయం సాధించారు. తన సమీప వైసీపీ అభ్యర్థి వంగా గీతపై 69,169 ఓట్ల మెజార్టీతో పవన్ విజయం సాధించారు. గత ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల్లో పోటీచేసి ఓడిపోయిన పవన్ కల్యాణ్.. ప్రస్తుత ఎన్నికల్లో ఘన విజయం సాధిచండంతో జనసైనికుల సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. పవన్ కల్యాణ్ విజయంతో సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్నారు.మరోవైపు కూటమిలో భాగంగా జనసేన పోటీ చేసిన 21 నియోజకవర్గాల్లో అన్ని స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించే అవకాశాలున్నాయి

# ఎన్నికల్లో సినీగ్లామర్

**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతుండగా, దేశవ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల నుండి చాలా మంది ప్రముఖ సినీ అభ్యర్థులు ముందంజలో ఉన్నారు. బీజేపీకి చెందిన కంగనా రనౌత్, సురేష్ గోపి విజయానికి చేరువలో ఉన్నారు. ప్రస్తుతం వారు తమ ప్రత్యర్థుల కంటే 74,000 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. మధుర బీజేపీ అభ్యర్థి హేమ మాలిని 1,89,000 ఓట్లకు పైగా ఆధిక్యంలో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో "పవర్ స్టార్" పవన్ కళ్యాణ్ 38,000 ఓట్లకు పైగా ఆధిక్యంలో ఉన్నారు.హిమాచల్ ప్రదేశ్‌లోని మండి నుంచి బీజేపీ అభ్యర్థి కంగనా రనౌత్ పోటీ చేయగా , ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో నటుడు అరుణ్ గోవిల్ , కేరళలోని త్రిసూర్‌లో సురేష్ గోపి కాషాయ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. మరోవైపు పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్‌లో శతృఘ్న సిన్హాను టీఎంసీ బరిలోకి దింపింది . ఇతర ప్రముఖ సెలబ్రిటీ అభ్యర్థులు రాధికా శరత్‌కుమార్ (బిజెపి), విరుదునగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. లాకెట్ ఛటర్జీ (బిజెపి, హుగ్లీ), మనోజ్ తివారీ (బిజెపి, ఈశాన్య ఢిల్లీ), రవి కిషన్ (బిజెపి, గోరఖ్‌పూర్), పవన్ సింగ్ (స్వతంత్ర, కరకట్), పవన్ కళ్యాణ్ (జనసేన, పిఠాపురం ) , ముఖేష్ (అఖఎఓ, కొల్లాం), ఉ కృష్ణ కుమార్ (బీజేపీ, కొల్లం) పోటీ చేశారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల ఫలితాలు 2024 ఈరోజు వెల్లడవుతుండగా, తెలుగు తారలు జనసేన పార్టీ (జేఎస్పీ) అధినేత పవన్ కళ్యాణ్, టీడీపీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ పోటీ చేసిన పిఠాపురం, హిందూపూర్ నియోజకవర్గాల్లో అధిక్యంలో దూసుకుపోతున్నారు.ఇక ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ అధికారంలోకి వస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేసినప్పటికీ, ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్ సగం సీట్లు సాధించి తన మార్కు చాటుకుంటోంది. జూన్ 1న చివరి దశతో ఏడు దశల్లో నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల 2024 ఓట్ల లెక్కింపు ఈరోజు ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. మధ్యాహ్నానికి ట్రెండ్‌లు కనిపించడం ప్రారంభిస్తే, మధ్యాహ్నానికి మాత్రమే స్పష్టమైన చిత్రం అందుబాటులో ఉంటుంది. తుది ఫలితం మంగళవారం అర్ధరాత్రి లేదా బుధవారం ఉదయం ఎన్నికల సంఘం ద్వారా ప్రకటించడం జరుగుతంది.

# వార్ వన్ సైడే

## - భారీ ఆధిక్యంతో ఎన్డీయే కూటమి

**విజయవాడ :** ఏపీలో వార్ వన్ సైడ్. టిడిపి కూటమికి ఏకపక్ష విజయం దక్కింది. ఏకంగా క్లీన్ స్వీప్ దిశగా ముందుకు సాగుతోంది. తెలుగుదేశం పార్టీకి సాలిడ్ విజయం దక్కగా.. జనసేన పోటీచేసిన అన్ని స్థానాల్లో విజయం దిశగా ముందుకెళ్తోంది. అటు బిజెపి సైతం మెరుగైన స్థానాలను దక్కించుకోనుంది. ఇదే ట్రెండ్ కొనసాగితే.. దాదాపు 160 స్థానాల వరకు టిడిపి గెలుచుకునే ఛాన్స్ కనిపిస్తోంది.తెలుగుదేశం పార్టీ ఒంటరిగా మ్యాజిక్ ఫిగర్ దాటేసింది. దాదాపు 130 వరకు ఆధిక్యంలో కొనసాగుతోంది. వాస్తవానికి ఈ స్థాయిలో ఫలితాలు వస్తాయని తెలుగుదేశం పార్టీ సైతం ఊహించలేదు. 2019 ఎన్నికల్లో సైతం 102 స్థానాలతోనే టిడిపి సరిపెట్టుకుంది. అటువంటిది టిడిపికి సాలిడ్ విజయం దక్కడంతో టిడిపి శ్రేణుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. గత ఐదేళ్లుగా టిడిపి శ్రేణులు ఎంతగానో ఇబ్బంది పడ్డాయి. బలపడేందుకు చంద్రబాబు చేయని ప్రయత్నం అంటూ లేదు. జనసేనతో కూటమి కట్టిన ఆయన అతి కష్టం మీద బిజెపి స్నేహాన్ని అందుకోగలిగారు. మూడు పార్టీల మధ్య సమన్వయం, సీట్ల సర్దుబాటు, ఓట్ల బదలాయింపు సక్రమంగా జరగడంతో కూటమి లక్ష్యానికి మించి సీట్లు దక్కించుకుంది.ఏపీలో టిడిపి కూటమి విజయం వెనుక జనసేన కీరోల్ ప్లే చేసింది. కూటమి కట్టడంలో పవన్ పాత్ర అభినందనీయం. ఎన్నెన్నో అడ్డంకులు సృష్టించారు. పొత్తుపై విష్రచారం చేశారు. మూడు పార్టీలు కలవకూడదని ఎన్నెన్నో ప్రయత్నాలు చేశారు. కానీ వాటిని సాధ్యం చేశారు పవన్ కళ్యాణ్. సీట్ల సర్దుబాటు నుంచిఓట్ల బదలాయింపు వరకు.. ప్రతి అంశంలోనూ పవన్ కళ్యాణ్ యాక్టివ్ రోల్ ప్లే చేశారు. పొత్తు లో భాగంగా 21 సీట్లను తీసుకున్న పవన్ ను ఎన్నెన్నో ప్రశ్నలు వేశారు.తాను బలంగా ఉన్న చోట మాత్రమే టికెట్లు తీసుకుంటానని చెప్పిన పవన్ అందుకు అనుగుణంగా.. సీట్లు సొంతం చేసుకోవడం విశేషం.అయితే ఎన్నడూ లేని విధంగా ఏపీలో భారతీయ జనతా పార్టీ సైతం బలపడింది. గత ఎన్నికల్లో ఒక్క శాతం ఓటింగ్ కూడా సాధించలేదు. అటువంటిది ఈసారి ఏకంగా నాలుగు శాతం వరకు ఓట్లు సాధించింది ఆ పార్టీ. సీట్ల పరంగా గణనీయంగా మెరుగుపడింది. అసెంబ్లీ సీట్లతో పాటు ఎంపీ సీట్లను సైతం గెలుచుకుంది. పొత్తులో భాగంగా ఆ పార్టీ తీసుకున్నది కేవలం 10 అసెంబ్లీ సీట్లు. ఆరు పార్లమెంట్ స్థానాలు. కానీ మెరుగైన స్థానాలను దక్కించుకోవడంతో వైసీపీ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. గ్లాసు గలగల లాడుతుండగా.. సైకిల్ కిలకిలలాడుతోంది. కమలం అయితే వికసించి.. తెగ ఆకట్టుకుంటుంది. ఫ్యాన్ మాత్రం రెక్కలు వీడి.. తిరిగేందుకు కూడా సతమతం అవుతోంది.

# అమరావతికే ఓటు

**విజయవాడ :** రాజధాని ప్రాంతంలో కూటమి అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. రాజధాని ప్రాంతమైన గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని 21 స్థానాల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయాలని నమోదు చేశారు. కృష్ణా జిల్లాలోని పామర్రు, గన్నవరం, గుడివాడ, అవనిగడ్డ, పెనమలూరు, పెడన, మచిలీపట్నం నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయాన్ని సాధించారు. ఈ జిల్లాలోని అవనిగడ్డలో జనసేన పోటీ చేయగా, ఆ పార్టీ అభ్యర్థి ఘన విజయాన్ని నమోదు చేశారు. అలాగే, ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, విజయవాడ వెస్ట్, విజయవాడ సెంట్రల్, విజయవాడ ఈస్ట్ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు విజయ దుందుభి మోగించారు. ఈ జిల్లాలో విజయవాడ వెస్ట్ నుంచి బిజెపి అభ్యర్థి విజయం సాధించగా, మిగిలిన స్థానాల్లో టిడిపి అభ్యర్థులు విజయాన్ని నమోదు చేశారు. గుంటూరు జిల్లాలోని తాడికొండ, ప్రత్తిపాడు, మంగళగిరి, పొన్నూరు, తెనాలి, గుంటూరు ఈస్ట్, గుంటూరు వెస్ట్ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయాన్ని నమోదు చేశారు. తెనాలి నుంచి జనసేన విజయం సాధించగా, మిగిలిన స్థానాల్లో టిడిపి అభ్యర్థులు విజయాన్ని నమోదు చేశారు.

# ఉభయ గోదావరిలో ఖాతా తెరవని వైసీపీ

రాష్ట్ర వ్యాప్తంగా కూటమి పార్టీల జోరు కనిపిస్తోంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సొంత ప్రాంతమైన ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలో కూటమి విజయ దుందుభి మోగించే దిశగా ముందుకు సాగుతోంది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలోని 34 నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు గెలుపు దిశగా భారీ మెజారిటీతో ముందుకు సాగుతున్నారు. ఈ జిల్లాల్లో వైసిపి ఖాతా కూడా తెరవణ పరిస్థితి నెలకొంది. తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం, కాకినాడ సిటీ, రామచంద్రాపురం, ముమ్మిడివరం, అమలాపురం, కొత్తపేట, మండపేట, రాజమండ్రి సిటీ, రాజమండ్రి రూరల్, జగ్గంపేట, రంపచోడవరం, కొవ్వూరు, ఆచంట, పాలకొల్లు, ఉండి, తణుకు, దెందులూరు, ఏలూరు, గోపాలపురం, చింతలపూడి నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం దిశగా ముందుకు సాగుతున్నారు. అలాగే, జనసేన పోటీ చేసిన పోలవరం, నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, రాజానగరం, నిడదవోలు, రాజోలు, పి గన్నవరం, పిఠాపురం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో జనసేన అభ్యర్థులు భారీ ఆధిక్యంతో విజయం దిశగా కొనసాగుతున్నారు. బిజెపి పోటీ చేసిన అనపర్తి నియోజకవర్గాల్లో విజయం దిశగా భారీ ఆధిక్యంతో కొనసాగుతున్నారు. ఇదే జిల్లాలోని పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన పవన్ కళ్యాణ్ 50 వేలకుపైగా ఆధిక్యంతో విజయం దిశగా ముందుకు సాగుతున్నారు.

# ఎన్డీయే కన్వీనర్‌గా చంద్రబాబు

**విజయవాడ :** తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయు? జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీజేపీకి పూర్తి మెజార్టీ దక్కే అవకాశం లేకపోవడంతో ఎన్డీఏ కూటమి కేంద్రంలో అధికారం చేపట్టనుంది. ఈ క్రమంలో చంద్రబాబు కూటమిని సమన్వయం చేసేందుకు కన్వీనర్ గా నియమించే అవకాశాలు ఉన్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ..చంద్రబాబుకు ఫోన్ చేశారు. ఏపీ ఎన్నికల్లో ఘన విజయం సాధించడంపై అభినందనలు తెలిపారు. ఈ క్రమంలో వారి మధ్య జాతీయ రాజకీయాలపై చర్చ జరిగినట్లుగా తెలుస్తోంది. కేంద్రంలో అనూహ్యమైన ఫలితాలు వచ్చాయి. ఎగ్దిట్ పోల్స్ అన్నీ తారుమారయ్యాయి. యూపీ, బీహార్, మహారాష్ట్ర , బెంగాల్ వంటి చోట్ల అనుకున్న విధంగా బీజేపీ ఫలితాలు సాధించలేకపోవడంతో వెనుకబడిపోయింది. పూర్తి మెజార్టీకి 272 స్థానాలు కావాల్సి ఉండగా.. బీజేపీ నెంబర్ 240 దగ్గరే ఆగిపోయే అవకాశం కనిపిస్తోంది.అయితే ఇతర ఎన్డీఏ మిత్రులు అరవై సీట్ల వరకూ సాధిస్తున్నారు. దీంతో మూడో సారి ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టడానికి పెద్దగా అవరోధం లేదనుకోవచ్చు.అయితే ఈ సారి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండదు. ఎదుకంటే బలమైన ప్రతిపక్షం తయారయింది. ఇండి కూటమి గణనీయమైన స్థానాలు సాధించింది. బలాన్ని రెండింతలు చేసుకుంది. 97 సీట్ల వరకూ సాధిస్తోంది. మిగతా పక్షాలు తృణమూల్ కూడా ఎగ్జిట్ పోల్స్ అంచనాలన్నింటినీ తలకిందులు చేసి ఏకంగా 31 చోట్ల విజయం సాధించింది.త తమిళనాడు, కేరళల్లో బీజేపీ అనుకున్న విధంగా ముందుకు రాలేదు. కర్ణాటకలో మంచి పలితాలు సాధించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ డబుల్ డిజిట్ సాధించింది. తెలంగాణలో ఎనిమిది సీట్లలో ముందంజలో ఉంది. ఈ క్రమంలో చంద్రబాబు .. ఇతర పార్టీలను కూడా ఎన్డీఏ వైపు ఆకర్షించే అవకాశాలు ఉన్నాయి. అందుకే.. చంద్రబాబును ఎన్డీఏ కన్వీనర్ గా ఉంచేందుకు బీజేపీ పెద్దలు ఆసక్తి చూపించే అవకాశాలు ఉన్నాయి.

# బయటకు వెళ్లిపోయిన వైసీపీ ఏజెంట్లు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో వైఎస్ఆర్‌సీపీకి అత్యంత ఘోరమైన ఓటమి ఖాయమయింది. ఉదయమే కౌంటింగ్ సెంటర్లకు వచ్చిన అభ్యర్థులు మొదటి రెండు, మూడు రౌండ్ల తర్వాత పరిస్థితి చూసి వెళ్లిపోయారు. మామూలుగా చివరి వరకూ ఉండి ఫలితం చూసి.. డిక్లరేషన్ ఫాం తీసుకుని వెళ్లాలి. కానీ ఏ రౌండ్‌లోనూ కనీసం గట్టి పోటీ ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో.. ఫలితం అర్థమైపోయి ఇంటి బాట పట్టారు. తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులు కొడాలి నాని, వల్లభనేని వంశీ నాలుగు రౌండ్ల తర్వాత గెలిచే అవకాశం లేకపోవడంతో ఇంటిబాట పట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. గత ఎన్నికల్లో వైసీపీ ఎంత భారీ విజయాన్ని సాధించిందో.. ఈ శసారి అంత కంటే ఎక్కువగా ఘోర పరాజయం పాయింది. ఎక్కడా కూ? గట్టిపోటీ ఇచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో అభ్యర్థులు డీలా పడిపోయారు. మూడు రౌండ్ల తర్వాత వరుసగా కౌంటింగ్ సెంటర్ల నుంచి వెళ్లిపోయారు. కౌంటింగ్ ఏజెంట్లు కూడా తర్వాత వెళ్లిపోవడంతో .. వైసీపీ తరపున ఓట్ల లెక్కింపును కూడా పర్యవేక్షించేవారు లేకపోయారు.ఎగ్జిట్ పోల్స్ వ్యతిరేకంగా వచ్చినా లోకల్ ఎగ్జిట్ పోల్స్.. బాగా వచ్చాయని పోటీ ఇచ్చే స్థాయిలో ఉంటామని వైసీపీ నేతలు అనుకున్నారు. అందుకే కాస్త గట్టిగా పోరాడి అయినా ఓట్లను తమకు అనుకూలంగా చేసుకునేందుకు ప్రయత్నించాలని సజ్జల రామకృష్ణారెడ్డి వంటి వారు కౌంటింగ్ ఏజెంట్లకు సలహా ఇచ్చారు.అయితే మొదటి రౌండ్లలోనే ఫలితం తేలిపోవడంతో.. వైసీపీ నిరాశ నిస్పృహల్లోకి వెళ్లిపోయింది.

# రిషికొండపై టీడీపీ జెండా

**విశాఖపట్నం** విశాఖ రుషికొండపై టీడీపీ శ్రేణులు టీడీపీ జెండాను రేపరేప లాడించారు. జగన్ రెండోసారి అధికా రంలోకి వచ్చాక విశాఖ రాజధానిగా రిషికొండ నుంచే పాలన చేస్తానని సంకే తాలు ఇచ్చిన వైఎస్సార్సీపీ నేతలు రిషికొండపై నుంచే తన పాలన ఉండా లని ఎంతో ముచ్చటపడ్డారు. అది నుంచి రిషికొండపై రహస్యంగా కార్య కలపాలను కొనసాగించిన జగన్ సర్కార్ చివరికి హై కోర్టును కూడా తప్పుదారి పట్టించారని టీడీపీ శ్రేణులు ఆరోపించాయి. రిషికొండపై నిర్మాణాల కోసం వందల కోట్లు ఖర్చు చేశారు. ఉన్నతాధికారులు సైతం ఈ నిర్మాణా ల్లో అత్యుత్సాహం చూపారని, కోర్టును తప్పుదోవ పట్టించారనే ఆరోపణలు కొంద లున్నాయి.అయితే ఎన్నికల ఫలితాలు వైసీపీకి పెద్ద షాకిచ్చా యి.కూటమికి స్పష్టమైన మెజారిటీ రావడంతో హర్షం వ్యక్తం చేస్తూ ఋషికొండపై టీడీపీ జెండాను ఎగుర వేశారు.

# కుదేలయిన వైకాపా

**అమరావతి** ఏపీ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం ధాటికి వైసీపీ కుదేలైంది. పలువురు మంత్రులతో పాటు ముఖ్యనేతలు ఓటమి బాటలో ఉన్నారు. మంత్రుల్లో ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరా జు, బొత్స సత్యనారాయణ, పీడిక రాజన్నదొర, గుడివాడ అమర్నాథ్, దాడిశెట్టి రాజా, చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, కొట్టు సత్యనారాయణ, అంబటి రాంబాబు, ఆదిమూలపు సురేశ్, ఆర్కే రోజా, బుగ్గన రాజేంద్ర నాథ్రెడ్డి, విడదల రజని, మేరుగు నాగార్జున, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాకాణి గోవర్ధన్రెడ్డి, ఉష శ్రీచరణ్ తదితరులు వెనుకంజలో కొనసా గుతున్నారు. సీఎం జగన్ సొంత జిల్లాలోనూ కూటమి గట్టి పోటీ ఇస్తోం ది. మరోవైపు జిల్లాలకు జిల్లాలనే కూటమి స్వీప్ చేసేలా కనిపిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 స్థానాలకు 12, చిత్తూరులో 14కు 12 చోట్ల కూటమి అభ్యర్థులు ముందం జలో ఉన్నారు. తూర్పుగోదావరిలో 19కి 19, గుంటూరులో 17కి 16, కడప 10లో 6 చోట్ల లీడ్లో కొనసాగుతున్నా రు. కృష్ణా జిల్లాలో 16కి 15, కర్నూలు లో 14కి 11, నెల్లూరులో 10కి 8 చోట్ల ఆధిక్యంలో ఉన్నారు. ప్రకాశం జిల్లాలో 12 స్థానాలకు 10 శ్రీకాకుళంలో 10కి 9, విశాఖపట్నంలో 15కి 13, విజయనగ రంలో 9కి 8, పశ్చిమగోదావరి జిల్లాలో 15కి 14 చోట్ల లీడ్లో కొనసాగుతున్నా రు. 25 ఏళ్ల తర్వాత ఉరవకొండ సెంటిమెంట్కు బ్రేక్..

# టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ విజయం

**అమరావతి :**ఏపీ ఎన్నికల ఫలితాలు అనేక రికార్డులును బద్దలు కొట్టింది. ఎన్నో సెంటిమెంట్లను బ్రేక్ చేసింది. తెలుగుదేశం, బీజేపీ గత 40 ఏళ్లలో ఎప్పుడూ గెలవని స్థానాలను ఈ ఎన్నికల్లో గెలుచుకుంది. ప్రధానంగా ఉరవకొండ సెంటిమెంట్ను ఈ ఎన్నికలు బ్రేక్ చేశాయి. 1999 నుంచి ఈ నియోజకవర్గంలో ఏ పార్టీ ఎమ్మెల్యే గెలిస్తే ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాదనే సెంటిమెంట్ ఉండేది. 1999 ఎన్నికల్లో ఉరవకొండ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి ఎల్లారెడ్డిగారి శివరామిరెడ్డి గెలవగా.. ఆ ఎన్నికల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో టీడీపీ అధికారంలోకి వచ్చింది.2004, 2009 ఎన్నికల్లో ఉరవకొండ ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ గెలవగా గెలుపొందగా ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. 2014లో వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వర్ రెడ్డి గెలవగా ఆ ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. 2019లో టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ గెలవగా ఏపీలో వైసీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. దీంతో ఈ ఎన్నికల్లో ఉరవకొండలో ఏ పార్టీ గెలుస్తుందో.. ఆ పార్టీ అధికారంలోకి రాదని అంతా భావించారు. కానీ 25 ఏళ్ల తర్వాత ఆ సెంటిమెంట్ బ్రేక్ అయింది. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ గెలవగా రాష్ట్రంలో మెజార్టీ సీట్లను టీడీపీ గెలుచుకుంది. దీంతో ఉరవకొండ సెంటిమెంట్ బ్రేక్ అయింది.

## జూన్ 9న సీఎంగా

# టీడీపీ అధినేత చంద్రబాబు ప్రమాణ స్వీకారం

**- వైసీపీ ప్రమాణ స్వీకార తేదీనే ఫిక్స్ చేసుకున్న టిడిపి**

**అమరావతి :** జూన్ 9న సీఎంగా టీడీపీ అధినేత చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనుండటం ఇది నాలుగోసారి కావడం విశేషం. అమరావతిలో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగనుంది. టీడీపీ చరిత్రలోనే అతి పెద్ద విజయాన్ని నమోదు చేసుకుంది. 161 సీట్లతో అధికారాన్ని చేజించుక్కించుకోనుంది. తుది ఫలితాలు వెలువడే సమయానికి సంఖ్య అటు ఇటు అవ్వొచ్చేమే కానీ అధికారాన్ని చేజిక్కించుకోవడమైతే ఫిక్స్ అయిపోయింది. టీడీపీ పోటీ చేసిన స్థానాల్లో 10 మినహా మిగిలిన అన్ని చోట్ల ముందంజలో ఉంది. అటు లోక్సభ విషయంలోనూ దాదాపు 22 స్థానాల్లో ఎన్డీఏ కూటమి హవా కొనసాగిస్తోంది.మరోవైపు వైసీపీ ప్రతిపక్ష హోదాను సైతం దక్కించుకునే పరిస్థితి కనిపించడం లేదు. మరి తుది ఫలితాలు వెలువడే సమయానికి ఏమైనా దక్కించుకుంటుందేమో చూడాలి. వైసీపీ ప్రతిపక్ష హోదా దక్కించుకోవాలంటే 18 స్థానాల్లో విజయం సాధించాలి. కానీ ఇప్పుడు వైసీపీ కేవలం 14 స్థానాల్లోనే ముందంజలో ఉంది.

ఇక ఆసక్తికర విషయం ఏంటంటే.. వైసీపీ గెలుస్తుందనే ధీమాతో జగన్ ముందుగానే తన ప్రమాణ స్వీకార తేదీని ఫిక్స్ చేసుకున్నారు. 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్టు చెప్పేశారు. ఇప్పుడు అదే తేదీన చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వైసీపీకి ఇది నిజంగా ఊహించని దెబ్బే. విజయం తధ్యమంటూ నానా యాగీ చేసిన వైసీపీ ఇంత ఘోర పరాజయాన్ని కల్లో కూడా ఊహించి ఉండదు.

# టిడిపి కార్యకర్తలపై - వైసీపీ కార్యకర్తల దాడి

**ఏలూరు** ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడులో టిడిపి కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తల దాడి జరిగింది. కూలింగ్ షాపు వద్ద కూల్ డ్రింక్ తాగుతున్న టిడిపి కార్యకర్తలలో కవ్వింపు చర్యలకు వైసీపీ కార్యకర్తలు పాల్పడ్డారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. కూల్ డ్రింక్ షాప్ లోని కూల్ డ్రింక్ సీసాలతో టిడిపి నేతలపై వైసిపి కార్యకర్తలు దాడి చేసారు. ఘటనలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టారు.

# నోట్లో నాలుకులా వుంటా

**మేడ్చల్** కీసర హోలిమేరి కాలేజీ వద్ద ఏర్పాటుచేసిన కౌంటింగ్ సెంటర్లో మీడియా పాయింట్ వద్ద ఈటల రాజేందర్ మాట్లాడారు. బీజేపీకి ఓటు వేసిన ప్రతిఒక్కరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్న. మీ విశ్వాసానికి తగ్గట్టు పని విధానం ఉంటుంది. మాకు రెండు కర్తవ్యాలు ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల కోసం కొట్లాడతాం. మోదీ గారి ప్రభుత్వం నుండి రాష్ట్రానికి నిధులు తెస్తాం. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతాం. 17 సీట్లలో 8 సీట్లు గెలిచి ఆధిపత్యం కొనసాగిస్తున్నాం. ఇది ప్రజల అశేర్వాదం. దేశంలో 300 సీట్ల పైగా సీట్లతో దేశంలో మూడోసారి మోదీగారు అధికారంలోకి రాబోతున్నారు. స్వేచ్ఛ స్వతంతం - ప్రగతి ఆత్మగౌరవం కోసం బీజేపీకి ఓటు వేశారు. మోదీ ఈ పదేళ్లలో పేదవారికి డబ్బున్న వారికి ఉన్న అంతరాలు తగ్గించారు. యువతకి ఉద్యోగ అవకాశాలు కలిపించారు. మౌలిక వసతులు ఏర్పాటు చేసారు. భారత ఆత్మగౌరవం పెంచారు. మోదీ హయాంలో బాంబుల మోతలు లేవు. నేను మల్కాజగిరి స్థానికుణ్ణి. నామీద విశ్వాసం ఉంచి గెలిపించారు. ఏ రౌండ్ లో మేజారిటీ తగ్గకుండా ఓట్లు వేశారు. కంటోన్మంట్ రోడ్స్, చెరువుల పునరుద్ధరణ, యువతకు ఉపాధి, పేదలకు ఇళ్ళు, ఇండస్ట్రియల్ కారిడార్, అన్ని నెరవేరుస్తా. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా. నోట్లో నాలుకలా ఉంటా. నాకు సహకరించిన అన్ని సంఘాలకి కృతజ్ఞతలు. కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలో ఉండి నాకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు. నాకు ఓటు వేస్తే సేఫ్ గార్డ్ ఉంటుంది అని, ప్రగతికి పునాది పడుతుంది అని ఓట్లు వేశారు. అందరికే ధన్యవాదాలు. అందరివాడిలా ఉంటా.. పొత్తుల సద్దిలా ఉంటా అని హామీ ఇస్తున్నా అని ఈటల అన్నారు. పది సంవత్సరాల తరువాత కూడా దేశ ప్రజలు మోడీ ని కోరుకుంటున్నారు అంటేనే వారిపట్ల ఉన్న అభిమానం అర్థం చేసుకోవచ్చు అని అన్నారు.

# దద్దరిల్లిన కూకట్పల్లి



**రంగారెడ్డి** జై చంద్రబాబు జై తెలుగుదేశం నినాదాలతో కూకట్పల్లి హౌసింగ్ బోర్డ్ హోరెత్తింది ఆంధ్రప్రదేశ్ లో టిడిపి జనసేన బిజెపి కూటమి విజయదుందుభి మోగించడంతో తెలంగాణలో తెలుగుదేశం శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నాయి. మినీ ఆంధ్రప్రదేశ్ గా భావించే కుకట్పల్లి హౌసింగ్ బోర్డులో ఒక్కసారిగా సంబరాలు మిన్నంటాయి వీరికి జనసేన శ్రేణులు జత కలిసాయి. బాణాసంచా కాల్చారు కేక్ కట్ చేశారు స్వీట్లు అభిమానులకు పంచిపెట్టారు చంద్రబాబు పవన్ కళ్యాణ్ రఘురామకృష్ణరాజు ఫోటోలతో జిందాబాద్ లు కొట్టారు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. సైకిల్ను ఎత్తి పట్టుకొని జై తెలుగుదేశం అంటూ నినాదాలు చేశారు.

# అటు భద్రాద్రి.. ఇటు పాపికొండలు

- పర్యాటక సందడి షురూ - శైవక్షేత్రాల సందర్శనకు చలో
- సిటీ టూర్.. అనంతగిరి పర్యటన
- తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రత్యేక ప్యాకేజీలు





పర్యాటక సందడి తిరిగి మొదలైంది. కోవిడ్ కారణంగా చాలా కాలంగా ఇళ్లకే పరిమితమైన నగరవాసులు కాలక్షేపం కోసం పర్యటనలకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ పర్యాటకుల అభిరుచికి అనుగుణమైన ప్యాకేజీలను రూపొందించింది. నగరంలోని చారిత్రక, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ఏసీ, నాన్ ఏసీ బస్సుల్లో హైదరాబాద్ను సందర్శించే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది.

**ప్రకృతి ఒడిలో..** పాపికొండల యాత్ర: ఇది ప్రతి శుక్రవారం ఉంటుంది. రాత్రి 8.30 గంటలకు



బయలుదేరుతారు. శనివారం ఉదయం భద్రాద్రికి చేరుకుంటారు. శ్రీరాముడి దర్శనం అనంతరం పర్ణశాలకు వెళ్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం పాపికొండలకు వెళ్తారు. రాత్రికి కొల్లూరులోని బ్యాంబూ హట్స్లో బస ఉంటుంది. మరుసటి రోజు బయలుదేరి తిరిగి నగరానికి చేరుకుంటారు. పెద్దవారికి చార్జీ రూ.4,594 ఉంటుంది. పిల్లలకు ఇందులో 80 శాతం వరకు చార్జీ ఉంటుంది.

**ఆధ్యాత్మికం.. రమణీయం..** అనంతగిరిహిల్స్: వికారాబాద్ సమీపంలోని అద్భుతమైన పర్యాటక ప్రాంతం అనంతగిరి విహారం కోసం నగరం నుంచి ఉదయం 9 గంటలకు బయల్దేరి రాత్రి 8 గంటలకు తిరిగి చేరుకుంటారు. అనంతగిరి కొండల్లో రమణీయమైన ప్రకృతిని ఆస్వాదించడంతో పాటు, పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించవచ్చు. ఈ టూర్ కోసం పెద్దవారికి రూ.900, పిల్లలకు రూ.720 చొప్పున చార్జీ ఉంటుంది.

**సిటీ టూరు.. బోటు షికారు..** సిటీ టూర్లో భాగంగా బిర్లా టెంపుల్, నిజామ్ మ్యూజియం, చౌమొహల్లా ప్యాలెస్, చార్మినార్ (బయట నుంచి మాత్రమే), జూపార్కు, తారామతి బారాదరి, గోల్కొండ తదితర పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు.ఈ పర్యటన కోసం ఏసీ వాహనాల్లో రూ.350, నాన్ ఏసీ వాహనాల్లో రూ.250 వరకు చార్జీ ఉంటుంది. పర్యటనలో భాగంగా టిఫిన్, భోజనం, వివిధ ప్రాంతాల్లో సందర్శన టికెట్ల రుసుము పర్యాటకులే చెల్లించాల్సి ఉంటుంది. రవాణా సదుపాయాన్ని మాత్రమే పర్యాటక అభివృద్ధి సంస్థ కల్పిస్తుంది. హుస్సేన్సాగర్లో బోటు షికారు కూడా అందుబాటులోకి తెచ్చారు.కాకతీయ రీజియన్ యాత్ర: ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్ నుంచి బస్సు బయలుదేరుతుంది. 2వ రోజు రాత్రి 9 గంటలకు తిరిగి చేరుకుంటారు. కాళేశ్వరం, రామప్ప, వేయిస్తంభాల గుడి, యాదాద్రి, కీసర తదితర పుణ్యక్షేత్రాల సందర్శన ఉంటుంది. పెద్దవారికి రూ.1,550, పిల్లలకు రూ.1,320 చొప్పున చార్జీ ఉంటుంది.

**శైవ క్షేత్రాల సందర్శన..**

శాతవాహన యాత్ర: ఈ పర్యటన కోసం నగరం నుంచి ప్రతి సోమవారం ఉదయం 7 గంటలకు బయలుదేరి తిరిగి రాత్రి 10 గంటలకు చేరుకుంటారు. వేములవాడ, కొండగట్టు, ధర్మపురి తదితర ఆలయాల సందర్శన ఉంటుంది. బస్సు చార్జీ పెద్దవారికి రూ.1300, పిల్లలకు రూ.1040 చొప్పున ఉంటుంది. ఆలయ ప్రవేశ రుసుము, భోజనం వంటివి పర్యాటకులే ఏర్పాటు చేసుకోవాలి. పంచారామాలకు: ఆంధ్రప్రదేశ్లోని పంచారామాలకు కూడా హైదరాబాద్ నుంచి టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఇది 3 రోజుల పాటు ఉంటుంది. ఉదయం 9 గంటలకు బయల్దేరి 3వ రోజు ఉదయం 7 గంటలకు తిరిగి నగరానికి చేరుకుంటారు. అమరావతి, పాలకొల్లు, భీమవరం, ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాలను సందర్శించవచ్చు. పెద్దవారికి రూ.3,500, పిల్లలకు రూ.2,800 చొప్పున చార్జీలు ఉంటాయి.

**బుకింగ్ ఇలా..** ఈ పర్యటనల కోసం తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ వెబ్సైట్ను సందర్శించవచ్చు.ఆన్లైన్లోనే టికెట్లు బుక్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం 040%--29801040, 98485 40371





## 60 నుంచి 70 శాతం కోకోతో తయారైన

# చాక్లెట్లు, బచ్చలి కూర తిన్నారంటే!

ఇటీవల కాలంలో వయసుతో సంబంధం లేకుండా గుండె జబ్బుల బారిన పడటం, కొందరు ఆకస్మాత్తుగా మృత్యువాత పడటాన్నీ చూస్తున్నాం, వింటున్నాం. గుండె ఆరోగ్యాన్ని పదికాలాలు పదిలంగా ఉంచుకోవాలంటే నిత్యం వ్యాయామం చేయడంతోపాటు సరైన పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలి. కొన్నిరకాల ఆహారాలు గుండె జబ్బులు వచ్చే అవకాశాలను పెంచుతాయి. కానీ కొన్ని మాత్రం గుండె ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయి. ఈ క్రమంలోనే గుండె ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన ఆహారం ఏమిటో, దానిని ఎందుకు, ఎలా తీసుకోవాలో తెలుసుకుందాం.

**ఫైబర్ ఎక్కువగా ఉండాలి..** నిత్యం మనం తీసుకునే ఆహారంలో ఫైబర్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. దీంతో గుండె సంబంధ వ్యాధులు వచ్చే అవకాశాలు బాగా తగ్గుతాయని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాల్లో వెల్లడైంది.ఫైబర్ హైబీపీని తగ్గిస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రిస్తుంది. దీంతో హార్ట్ స్ట్రోక్స్ రాకుండా ఉంటాయి.ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు గుండె ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయి.ఇవి ఉన్న ఆహారాన్ని నిత్యం తీసుకోవాలి.దీంతో శరీరంలో వాపులు తగ్గుతాయి. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది.చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా ఉంటాయి కనుక వాటిని తరచూ తినడం వల్ల గుండె వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు.

**వెజిటేరియన్లు ఎలా?** ఇక వెజిటేరియన్లు నట్స్, సీడ్స్ తినడం ద్వారా ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు లభిస్తాయి.బాదంపప్పు, వాల్నట్స్ వంటి వాటిని నిత్యం గుప్పెడు మోతాదులో తింటే గుండె జబ్బులు రాకుండా ఉంటాయి.వీటిల్లో ఉండే పోషకాలు గుండె ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుతాయి.నట్స్ను తినడం వల్ల అధిక బరువు తగ్గుతారు.

**అధిక బరువు తగ్గించుకుంటేనే..** అధికంగా బరువు ఉండడం వల్ల కూడా గుండె వ్యాధులు వచ్చేందుకు అవకాశం ఉంటుంది. కనుక బరువును ఎప్పుడూ నియంత్రణలో ఉంచుకోవాలి. అధికంగా బరువు ఉన్నవారు బరువు తగ్గే ప్రయత్నం చేయాలి. దీనివల్ల గుండె వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు.

**ప్రొటీన్ ఫుడ్ :** ప్రొటీన్ అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవటం మంచిది.చికెన్, ఫిష్ పప్పులు, ఫ్యాట్ తక్కువ ఉన్న పాలూ, పాల పదార్థాలూ, ఎగ్స్లో ప్రొటీన్ పుష్కలంగా లభిస్తుంది.అదే విధంగా కూరగాయలూ, పండ్లలో విటమిన్స్, న్యూట్రియెంట్స్ లభిస్తాయి. వీటిలో కాలరీలు తక్కువ, ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. కూరగాయలూ, పండ్లూ వంటివి శాకాహారం లో ఉండే కొన్ని గుణాలు కార్డియో వాస్క్యులర్ డిసీజెస్ రాకుండా చేస్తాయి.



**కొలెస్ట్రాల్ను తగ్గించుకునేందుకు..** సాల్మన్ ఫిష్, ట్యూనా, హెర్రింగ్ లాంటి చేపలు గుండెకు ఆరోగ్యకరం. వీటిలో గుండె కొట్టుకోవడంలో తేడానీ, రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవడాన్నీ, ట్రై గ్లిజరైడ్స్నూ తగ్గించే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ వీటిలో ఎక్కువుంటాయి. వారానికి కనీసం రెండు సార్లయినా ఈ చేపలు తింటే బెటరని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ సిఫార్సు చేసింది. ఓట్ మీల్ తింటే మంచిది. పీచు పదార్థం ఉండే ఈ ఓట్ మీల్ ఒంట్లో కొలెస్ట్రాల్ను తగ్గిస్తుంది. జీర్ణకోశ మార్గంలో ఇది ఒక స్పాంజ్లా పనిచేసి, కొలెస్ట్రాల్ను నానిపోయేలా చేసి, రక్తంలో ఇంకిపోకుండా ఒంట్లో నుంచి తొలగిస్తుంది. హోల్ వీట్ బ్రెడ్ లాంటి తృణధాన్యాలతో చేసినవి తిన్నా మంచిదే.స్ట్రాబెర్రీలు, బ్లూ బెర్రీల లాంటివి తింటే, ఆ పండ్లలో ఉండే ఫైటోన్యూట్రియెంట్స్, పీచుపదార్థాలు రక్తనాళాల్ని వెడల్పు చేసి, గుండె పోటు వచ్చే అవకాశాలు తగ్గిస్తాయని ఒక పరిశోధనలో వెల్లడైంది.

**చాక్లెట్లు కూడా..** డార్క్ చాక్లెట్లు, అంటే కనీసం 60 నుంచి 70 శాతం కోకోతో తయారైన చాక్లెట్లు తింటే, అధిక రక్తపోటు, రక్తం ఊరిగే గట్టకట్టుకుపోవడం లాంటివి తగ్గుతాయి.అయితే, మామూలు మిల్క్ చాక్లెట్లు, క్యాండీ బార్ల వల్ల ఉపయోగం లేదు. అయితే వీటిని కూడా చాలా పరిమితంగా తీసుకోవాలి.

**వీటిని తీసుకుంటే..** విటమిన్ 'సి' ఎక్కువగా ఉండే బత్తాయిలు, కమలా పండ్ల లాంటి నిమ్మజాతి పండ్లు తినాలి. అయితే, ఈ పండ్ల రసాల్లో మళ్ళీ అతిగా పంచదార కలుపుకోకూడదు.సోయా పాలు, సోయా జున్ను (తోఫూ) తింటే ఒంటికి కావాల్సిన ప్రొటీన్లు వస్తాయి.అనారోగ్యకరమైన కొవ్వు, కొలెస్ట్రాల్ ఒంట్లో చేరవు. సోయా ప్రొటీన్లు ఒంట్లో చెడ్డ కొలెస్ట్రాల్ను తగ్గిస్తాయి.

**ఈ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో..** బంగాళదుంపలు అనగానే అతిగా పిండిపదార్థమని చాలామంది పక్కనపెడుతుంటారు. కానీ, అతిగా వేయించనంత వరకు బంగాళదుంపలు గుండెకు ప్రమాదకరం కావు. పొటాషియం ఎక్కువగా ఉండే వీటిలో ఫైబర్ ఉంటుంది.టొమాటోలలో కూడా గుండెకు ఆరోగ్యమిచ్చే పొటాషియం ఉంటుంది. ఇందులోని విటమిన్లు రక్తాన్ని శుద్ధి చేస్తాయి. గుప్పెడన్ని నట్స్ అంటే బాదంపప్పు, అక్రోటు కాయలు (వాల్నట్స్), వేరుసెనగ లాంటివి తగు మోతాదులో తినాలి. వాటిలో చెడ్డ కొలెస్ట్రాల్ను తగ్గించే విటమిన్ 'ఇ' ఉంటుంది.బచ్చలి కూర లాంటి ఆకుకూరలు గుండెకు అదనపు బలం ఇస్తాయి.దానిమ్మలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ. రోజూ నిర్ణీత మోతాదులో కనీసం మూడు నెలల పైగా దానిమ్మ రసం తాగితే, గుండెకు రక్తప్రసారం బాగా మెరుగవుతుంది.దానిమ్మ పండు గుండె రక్తనాళాల్లో పేరుకుపోయే అడ్డంకులు (ప్లాక్స్)నూ శుభ్రం చేస్తాయి. యాపిల్ పండ్లు కూడా.అవిశె గింజలలో (ఫ్లాక్ సీడ్స్) పీచు, ఒమెగా ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. వాటిని రోజుకు 20 గ్రాములు తింటే మేలు.

ప్రజాప్రశ్న



# జగన్ నాకు వ్యక్తిగత శత్రువు కాదు

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఒక చారిత్రాత్మక రోజని అన్నారు. తాము ఎన్నికల సమయంలో ఏదైతే చెప్పి అధికారంలోకి వచ్చామో అది కచ్చితంగా నెరవేరుస్తామని తెలిపారు. ముఖ్యంగా ఓ జవాబుదారు ప్రభుత్వంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఐదు కోట్ల ప్రజల భవిష్యత్తుకు పునాదులు వేయడానికి కృషి చేస్తామని ఆయన చెప్పుకొచ్చారు. అలాగే వైసీపీ అధినేత వైఎస్ జగన్ తనకు వ్యక్తిగత శత్రువు కాదన్నారు. ఆయనను ఇబ్బంది పెట్టడానికి మేము అధికారంలోకి రాలేదని తెలిపారు. వైసీపీని భవిష్యత్తులో ఇబ్బంది పెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. కూటమికి ఘన విజయం అందించిన ఏపీ ప్రజలకు మంచి చేయడానికి కృషి చేస్తామని పవన్ హామీ ఇచ్చారు.

జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు ఎవరూ కూడా ఎలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడకూడదని చెప్పారు.ఇక 2019లో ఓడిపోయినప్పుడు తన మానసిక స్థితి ఎలా ఉందో ఇప్పుడు గెలిచాక కూడా అలాగే ఉందన్నారు. ఆంధ్ర ప్రజలు తనకు పరువు ఇచ్చారు, ఇంత గెలుపు ఇచ్చారు, ఆకాశమంత ఉత్సాహం ఇచ్చారని జనసేనాని తెలిపారు. ఇప్పుడు వారిని గుండెల్లో పెట్టుకుంటానని చెప్పారు.

వారి కష్టాలలో పాలుపంచుకుంటానని అన్నారు. మీ ఇంట్లో కుటుంబ సభ్యుడిగా తనను గుర్తు పెట్టుకోవాలన్నారు. మీ కుటుంబంలో ఒకడు అసెంబ్లీలో అడుగుపెడుతున్నాడని అనుకోవాలంటూ పవన్ తెలిపారు. ప్రభుత్వం ఎలా ఉండాలి.. అధికార యంత్రాంగం ఎలా పని చేయాలి అనే విషయాలను రాబోయే రోజుల్లో చేసి చూపిస్తానని చెప్పుకొచ్చారు. ఇక ఈ ఎన్నికల్లో జనసేన పోటీ చేసిన 21 చోట్ల విజయం దిశగా దూసుకెళ్తున్న విషయం తెలిసిందే. అటు ఎంపీగా బరిలోకి నిలిచిన రెండు చోట్ల కూడా ఆ పార్టీ ఆధిక్యంలో ఉంది.

# మోడీ, షాలను తిరస్కరించారు

నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతలు మాట్లాడారు. ఈ ఎన్నికల ఫలితాలు ప్రజల విజయమన్నారు. ప్రజలు నరేంద్ర మోడీ, అమిత్ షాలను తిరస్కరించారని రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కోసమే. యుద్ధం చేశామని, తమ పోరాటాన్ని ప్రజలు స్వాగతించారని రాహుల్ గాంధీ చెప్పారు. ఎన్నికలకు ముందు అన్ని వ్యవస్థలు తమకు వ్యతిరేకంగానే పనిచేశాయని గుర్తు చేశారు. అయినా సరే కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు, కార్యకర్తలు అద్భుతంగా పోరాటం చేశారని కొనియాడారు. ఇండియా కూటమి తదుపరి కార్యచరణపై బుధవారం సమావేశం కానున్నట్లు తెలిపారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి ఈ దేశ ప్రజలు కలిసికట్టుగా పోరాటం చేస్తారని తాను అనుకున్నానన్న రాహుల్ ఈ సందర్భంగా దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఎన్నికల కోసం కాంగ్రెస్ నేతలు ఎంతో చేశారు. కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు,కార్యకర్తలు అద్భుతంగా పోరాటం చేశారని అభినందించారు రాహుల్. పాత మిత్రులైన పీడీపీ, జేడీయూతో సంప్రదింపులు జరుపుతారా?.. ప్రతిపక్షంలోనే ఉంటారా? అని మీడియా ప్రతినిధులు అడగ్గా "బుధవారం మా ఇండియా కూటమి నేతలతో సమావేశం ఉంటుంది. వారితో సంప్రదింపులు చేయకుండా ఎలాంటి ప్రకటనలు చేయం" అని రాహుల్ స్పష్టంచేశారు. అలాగే కేరళలోని వయనాడ్‌తో పాటు యూపీలోని రాయ్‌బరేలీ రెండు సీట్లలో సాధించిన విజయం గురించి స్పందించారు. "నేను రెండు స్థానాల్లో ఉండటం కుదరదు. దానిపై ఆలోచిస్తున్నాను. ఏ సీటు వదులుకోవాలనే దానిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు' రాహుల్ తెలిపారు.అంతకుముందు మల్లిఖార్జున ఖర్గే మాట్లాడుతూ ఇది ప్రజలు ఇచ్చిన తీర్పు అని, ప్రజా తీర్పును వినమ్రంగా స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈరోజు దేశంలో ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ఈ ఫలితాలు ప్రజల ఫలితాలు. ఇది ప్రజల విజయం. ఇది ప్రజాస్వామ్య విజయం. ఈ పోరు మోడీ వర్సెస్ ప్రజలని మేము మొదటి నుంచి చెబుతున్నాం. ఈసారి ప్రజలు ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఇవ్వలేదు. కానీ, ప్రజలకు మోడీకి వ్యతిరేకంగా ఉన్నారని ఆదేశం వచ్చింది. ఇది ఆయన (మోడీ)కి రాజకీయ, నైతిక పరాజయం అని మల్లిఖార్జున వ్యాఖ్యానించారు.

# ఆంధ్రప్రదేశ్ ఫలితాల్లో టీడీపీ క్లీన్‌స్వీప్

షాకింగ్ కలిగిస్తోంది. ఇక టీడీపీ- బీజేపీ-జనసేన కూటమి సంచలనం సృష్టించింది. ఏకంగా 164 స్థానాల్లో విజయం సాధించడం విశేషం. టీడీపీ 144కు గానూ 135, జనసేన 21కి 21, బీజేపీ 10 చోట్ల పోటీ చేస్తే 8 స్థానాల్లో గెలిచింది. కాంగ్రెస్ ఒక్క చోట కూడా గెలవలేదు. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమయ్యే 88 స్థానాల కంటే దాదాపు డబుల్ స్థానాలు టీడీపీ గెలిచింది. పవన్ కళ్యాణ్ పిఠాపురంలో దాదాపు 70 వేల మెజార్టీతో గెలిచారు. నారా లోకేశ్ మంగళగిరిలో అత్యధికంగా 91 వేల మెజార్టీతో గెలుపొందారు. టీడీపీ అధినేత, కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఉద్దేశించి సందేశం వెలువరించారు. "ఏపీ గెలిచింది. ఏపీ ప్రజలు గెలిచారు. ఇవాళ నా హృదయం కృతజ్ఞతాభావంతో ఉప్పొంగుతోంది. ఓట్ల వెల్లువతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని ఆశీర్వదించిన మన రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. మన రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ఐక్యంగా పోరాడి గెలిచాం. దెబ్బతిన్న రాష్ట్రాన్ని పునర్ నిర్మించుకునేందుకు కలిసికట్టుగా కృషి చేస్తాం. ఈ సందర్భంగా ఏపీ భవిష్యత్తుకు కట్టుబడి ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, జేపీ నడ్డాలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఏపీలో మా కూటమి భారీ విజయం సాధించిన నేపథ్యంలో జనసేనాని పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిలను అభినందిస్తున్నాను. మా కూటమి కార్యకర్తలు, నేతల కఠోర శ్రమ, అంకితభావం ఫలితంగా ఈ చారిత్రాత్మక విజయం సాకారమైంది. చివరి ఓటు కూడా పడే వరకు వాళ్లు తెగించి పోరాడిన తీరు అద్భుతం. ఈ సందర్భంగా మా కూటమి నేతలకు, కార్యకర్తలకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను" అంటూ చంద్రబాబు స్పందించారు.

## రాస్తా రోకోల పేరుతో రోడ్ల మీదకు వచ్చి ప్రజా రవాణాకు శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు...

### - ఏదైనా సమస్య ఉంటే సంబంధిత అధికారులకు పిర్యాదు చేయాలి.

**రాజన్న సిరిసిల్ల** జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలే తప్ప, రాస్తా రోకోల పేరుతో రోడ్ల మీదకు వచ్చి ప్రజా రవాణాకు,శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.సోమవారం రోజున గంభీరవుపేట్ మండలం గోరంటల గ్రామానికి చెందిన గొల్లపల్లి ఎల్లయ్య అనే వ్యక్తి రోడ్ ప్రమాదంలో చనిపోగా ఎల్లయ్య కి సంబంధించిన బందువులు రోడ్ ప్రమాదం చేసిన వ్యక్తి నుండి నష్ట పరిహారం పోలీసులు ఇప్పించాలని గోరంటాల బస్టాండ్ వద్ద రోడ్డుపై కూర్చుని ప్రజ రవాణాకు ఇబ్బంది కలిగిస్తూ పోలీసు వారు చెప్పిన వినకుండా ఇబ్బందులు గురిచేసినా కుమిరిశెట్టి మహేందర్, మెండే సుమన్, అలివేలి మురళి, శనిగరపు ముత్తయ్య, అలి వెలి లక్ష్మయ్య , దండవేని మురళి అనే ఆరుగురు వ్యక్తులు పై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. వీర్నపల్లి మండలం బాబాయ్ చెరువు తండా కి చెందిన మమత అనే మహిళ ఆత్మహత్యా చేసుకొని చనిపోగా మమత కి సంబంధించిన కుటుంబ సభ్యులు మమత మరణానికి గోలియనాయక్ తండా కి చెందిన సతీష్ కారణం అని పోలీస్ వారికి పిర్యాదు చేయకుండా సతీష్ ఇంటి పై దాడి చేసిన 10 మంది పై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ ముందు వీర్నపల్లి మండలం బాబాయ్ చెరువు తండాలో చనిపోయిన మమతకు న్యాయం జరగాలని పోలీసులకు పిటిషన్ ఇవ్వమంటే ఇవ్వకుండా రోడ్డు పై కూర్చుని ప్రజా రవాణాకు ఇబ్బంది కలిగిస్తూ పోలీసు వారు చెప్పిన వినకుండా ఇబ్బందులు గురిచేసినా 5 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు.

జిల్లాలో వివిధ సందర్భాల్లో చనిపోయిన వారికి సంబంధించిన బందువులు ఏమైనా నష్టపరిహారం పోలీసులు ఇప్పించాలని రోడ్ల పై కూర్చుని ప్రజాశాంతికి భంగం కలిగిస్తూ ప్రజ రవాణాకు ఇబ్బంది కలిగిస్తూ పోలీసు వారు చెప్పిన వినకుండా ఇబ్బందులు గురిచేసినా వారిపై జిల్లాలో ఇప్పటి వరకు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 9 కేసులలో 52 మందిని అరెస్ట్ చేయడం జరిగిందని అన్నారు. ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పిర్యాదు చేయాలని, అట్టి సమస్యపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. చట్టాన్ని తమ చేతులోనికి తీసుకుని రోడ్ల మీదకు వచ్చి సామాన్య ప్రజానీకానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠిన వ్యవహరిస్తామని ఈ సందర్భంగా ఎస్పీ హెచ్చరించారు.

# జగన్ నిరంకుశ పాలనే?..

**విజయవాడ** ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్పందించారు. జగన్మోహన్ రెడ్డి నిరంకుశ పాలన వల్లే వైసీపీకి పరాభవం. ఐదేళ్లపాటు జగన్మోహన్ రెడ్డి చేసిన కక్ష సాధింపు రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజా తీర్పు ఇది. ప్రజా ఉద్యమాలను జగన్ అణిచివేసి పోలీసు రాజ్యం నడిపించారు.

ప్రతిపక్ష నేతలపై వేధింపులు, బెదిరింపులు, అక్రమ అరెస్టులు చేశారు. అమరావతి రాజధానిని నిర్వీర్యం చేసేలా మూడు ముక్కలాట ఆడారు. విపరీతంగా అప్పులు చేసి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దివాలా తీయించారు. అభివృద్ధి అనే మాటను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అటకెక్కించింది. ఫలితంగా జగన్ సర్కార్ ఓటమి చవిచూసిందని అన్నారు.

# తెలంగాణలో అనుహ్య ఫలితాలు

అత్యధిక మెజార్టీతో జానారెడ్డి తనయుడు రఘువీర్ రెడ్డి రికార్డు నెలకొల్పారు. దాదాపు 10మంది నేతలు లక్షల ఓట్ల మెజార్టీతో విజయం సాధించడం విశేషం.

- నల్గొండ పార్లమెంట్ స్థానంలో రఘువీర్ రెడ్డి విజయం సాధించారు. ఆయనకు తెలుగు రాష్ట్రాల్లోనే అత్యధికంగా 5.51 లక్షలకు పైగా మెజార్టీ వచ్చింది.
- భువనగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డి 1.95 లక్షలకు పైగా మెజార్టీతో విజయడంకా మోగించారు.
- వరంగల్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య 2.02 లక్షల ఓట్లకుపైగా మెజార్టీ సాధించారు.
- మహబూబాబాద్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ 3.24 లక్షల మెజార్టీతో ఘన విజయం సాధించారు.
- జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ 45 వేలకుపైగా మెజార్టీతో విజయం సాధించారు.
- నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి 79,182 ఓట్ల మెజార్టీతో విజయ దుంధుబి మోగించారు.
- నిజామాబాద్‌లో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ 1.13 లక్షలకు పైగా మెజార్టీతో గెలుపొందారు.
- కరీంనగర్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ 2.12లక్షలకు పైగా ఓట్లతో విజయం సాధించారు.
- పెద్దపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ 1.30 లక్షలకు పైగా మెజార్టీతో విజయం
- మహబూబ్‌నగర్ స్థానంలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ 4500 ఓట్ల స్వల్ప మెజార్టీతో విజయం సాధించారు.
- మెదక్‌లో బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు విజయకేతనం ఎగురవేశారు.
- సికింద్రాబాద్‌లో కిషన్ రెడ్డి (బీజేపీ) విజయం సాధించారు.
- మల్కాజిగిరిలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఘన విజయం సాధించారు.
- చేవెళ్లలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి విజయం సాధించారు.
- హైదరాబాద్ స్థానంలో ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఓవైసీ విజయం సాధించారు.

# ఇదొక చారిత్రక ఘట్టం

ప్రజలు మూడోసారి పట్టం కట్టారని ప్రధాని మోడీ చెప్పారు. 12 కోట్ల మందికి సురక్షిత నీరు అందించామన్నారు ప్రధాని మోడీ. నాలుగు కోట్ల మంది పేదలకు పక్కా ఇళ్లు కట్టించామని తెలిపారు. దేశ హితం కోసం నిత్యం ఆలోచిస్తామని ఆ దిశగా అడుగులు వేస్తామన్నారు. తాము చేపట్టిన పనుల వల్ల దేశం ప్రగతిపథంలో పయనిస్తోందని తెలిపారు. మీ ఆశీర్వాదమే నిరంతరం పని పనిచేసేందుకు తనకు ప్రేరణ అని మోడీ చెప్పారు. తాజా లోక్‌సభ ఫలితాలు ప్రజాస్వామ్యాన్ని గెలిపించాయన్నారు.

# బీఆర్ఎస్‌కు గుండు 'సున్నా'

పర్సెంట్‌తోనే ప్రతిపక్ష స్థానానికి వచ్చిందనుకుంటే ఈ లోక్ సభ ఎన్నికల్లో మొత్తానికి అడ్రస్సే గల్లంతయ్యింది. ఇది ఆరు నెలల్లో బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి. 2001లో టీఆర్ఎస్ పార్టీని స్థాపించగా అప్పటి నుంచి ఇప్పటివరకు లోక్ సభ ఎన్నికల్లో ప్రతిసారి గులాబీ పార్టీ నేతలు ప్రతినిధ్యం వహిస్తూ వచ్చారు. అయితే ఒక్క బీఆర్ఎస్ అభ్యర్థి కూడా లోక్ సభకు వెళ్లలేకపోతుండటం ఇదే మొదటిసారి. ఉద్యమ పార్టీగా ఆవిర్భవించిన బీఆర్ఎస్ ఇప్పుడు రాజకీయంగా పూర్తిగా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. కేవలం ఆరు నెలల్లోనే బీఆర్ఎస్ పరిస్థితి మొత్తం తలకిందులైంది. తెలంగాణ రాష్ట్రం 2014లో ఆవిర్భవించగా ఆ ఏడాది జరిగిన లోక్ సభ ఎన్నికల్లో 11 ఎంపీ సీట్లు గెలవగా 2019లో జరిగిన ఎన్నికల్లో 9 ఎంపీ స్థానాలు గెలుచుకోగా ఈసారి మాత్రం ఒక్కటి కూడా గెలవకపోవటం శోచనీయం. 17 ఎంపీ స్థానాల్లో ఒక్క దాంట్లో కూడా కనీసం పోటీ ఇవ్వకపోవటం గమనార్హం. లోక్ సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ అడ్రస్ మొత్తం గల్లంతు అవుతుందంటూ ప్రత్యర్థి పార్టీల నేతలు చేసిన వ్యాఖ్యలే ఇప్పుడు నిజమవుతున్నట్టు కనిపిస్తోంది.

తెలంగాణ రాష్ట్రానికే పరిమితమైన టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చుతూ ప్రాంతీయ పార్టీ నుంచి జాతీయ పార్టీగా ఎదిగి దేశ రాజకీయాల్లో చక్రం తిప్పుతామంటూ గులాబీ బాస్ కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో ప్రకటించారు. తెలంగాణలోనే కాకుండా పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లో కూడా పార్టీని విస్తరించేందుకు అన్ని రకాలుగా ప్రయత్నించారు. మహారాష్ట్రలో వరస సభలు పెట్టి పార్టీని నిలబెట్టేందుకు ప్రయత్నించారు. ఏపీలోనూ పార్టీ అధ్యక్షున్ని నియమించారు. ఈసారి ఎన్నికల్లో ఏ జాతీయ పార్టీకి కచ్చితమైన మెజార్టీ రాదని.. ఎన్డీఏ, ఇండియా కూటమిలకు ధీటుగా థర్డ్ ఫ్రంట్ వస్తుందని తమలాంటి ప్రాంతీయ పార్టీలే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటంలో కీలక పాత్ర పోషిస్తాయంటూ కేసీఆర్ పదే పదే చెప్పుకొచ్చారు. అయితే కేసీఆర్ చెప్పిన మాటలు, వ్యూహాలు పూర్తిగా బెడిసికొట్టాయి. ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించటం పక్కనపెడితే.. అసలు తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో ఖాతా కూడా తెరవకపోవటం గమనార్హం. ప్రధాని అయ్యేందుకు అవకాశం వస్తే కచ్చితంగా ముందుండి దేశాన్ని నడిపిస్తానంటూ ఏకంగా పీఎం కుర్చీ మీదే కన్నేసిన కేసీఆర్ ఈసారి కనీసం లోక్ సభలో ప్రతినిధ్యం వహించేందుకు ఒక్క ఎంపీని కూడా గెలిపించుకోలేకపోవటం శోచనీయం.అయితే హీరోగా ఉన్న బీఆర్ఎస్ జీరోగా కావటానికి కారణాలపై ప్రస్తుతం సర్వత్రా చర్చ నడుస్తోంది. ప్రభుత్వ వ్యతిరేకతతే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి కారణమని అందరూ విశ్లేషించారు. అయితే అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌లో ఉన్న కీలక నేతలంతా కాంగ్రెస్ పార్టీలోకి జంప్ అవటం క్షేత్రస్థాయిలో గులాబీ బలగం ఢీలా పడిపోవటం, కార్యకర్తలంతా పార్టీ మారిన నేతల వెంటే నడవటం బీఆర్ఎస్ పార్టీకి పెద్ద దెబ్బగా మారింది. గులాబీ బాస్ కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగినా ఏమాత్రం లాభం కనిపించకపోవటం ఇప్పుడు పార్టీ ఉనికినే ప్రశ్నార్థకంగా మారిన దుస్థితి ఏర్పడింది.

# ఎదురుతన్నిన ఎగ్జిట్ పోల్స్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఈసారి జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై తాజాగా పలు జాతీయ, ప్రాంతీయ మీడియా సంస్థలు, సర్వే ఏజెన్సీలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వెల్లడించాయి. ఇందులో జాతీయ స్థాయిలో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధిస్తుందని పలు జాతీయ మీడియా సంస్థలు తేల్చేశాయి. అలాగే మిత్రపక్షాలతో సంబంధం లేకుండానే బీజేపీ ఒంటరిగానే ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ సాధిస్తుందని తేల్చాయి. అలాగే ఒడిశాలోనూ హంగ్ అసెంబ్లీ వస్తుందని ఎగ్జిట్ పోల్స్ ఇచ్చాయి. కానీ వెలువడిన ఫలితాల్లో ఇవన్నీ తప్పని తేలిపోయింది. కేంద్రంలో ఎన్డీయే కూటమి మ్యాజిక్ మార్క్ అయిన 272 సీట్లను దాటి స్వల్ప మెజార్టీ మాత్రమే సాధించింది. అంత కాదు విపక్ష ఇండియా కూటమికి 160 సీట్లలోపే వస్తాయని జాతీయ మీడియా ఛానళ్లు చేసిన ఎగ్జిట్ పోల్స్ తప్పని నిరూపణ అయింది. ఇండియా కూటమి దాదాపు 230 సీట్లకు దూసుకెళ్లింది.

# మంచి చేసిన ఓడించారు

అమరావతి (ప్రశ్న న్యూస్) ఎన్నికల ఫలితాల పై జగన్ తొలి సారి స్పందించారు. తాను చేసిన మంచిని వివరించారు. ఫలితాలు చూస్తే ఆశ్చర్యకరంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఫలితాలు ఇలా వస్తాయని ఊహించలేదన్నారు. ప్రతీ ఇంటికి వివక్ష లేకుండా అవినీతి లేకుండా 2.70 లక్షల కోట్లు అందించామని గుర్తు చేసారు.

వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటికే సేవలు అందించామని చెప్పారు. ఇంతగా ఆలోచించిన మార్పులు తీసుకొస్తే ఆ ప్రేమ అభిమానం ఏమందోనని జగన్ ఆవేదన వ్యక్తం చేసారు. జగన్ ఎన్నికల ఫలితాల పైన స్పందిస్తూ తాను ఎంతగా అందరికి మంచి జరిగిన తరువాత ఆ అభిమానం ఆ ఆప్యాయత ఏమైందో తెలియదని పేర్కొన్నారు. ఎవరో మోసం చేసారు అన్యాయం చేసారో అనచ్చు కానీ, ఆధారం లేదన్నారు. ఏం జరిగిందో దేవుడికి తెలుసన్నారు. మంచి చేయటానికి మాత్రం ప్రజలకు మంచి వాయిస్ గా ఉంటామని చెప్పారు. పేదవాడికి అండగా ఉండే కార్యక్రమంలో ముందు నిలుస్తామని హామీ ఇచ్చారు. పేదవాడికి అండగా నిలుస్తామని ప్రకటించారు. కూటమిలో ఉన్న చంద్రబాబు,బీజేపీ, పవన్ కు అభినందనలు తెలిపారు.ఓడిపోయినా కూడా ప్రతీ కష్టంలో అండగా నిలిచిన ప్రతీ కార్యకర్త, వాలంటీర్ కు జగన్ కు ధన్యవాదాలు తెలిపారు. అమ్మఒడి అందుకున్న53 లక్షల మందికి మంచి చేసాను వారి పిల్లల కోసం తాపత్రయ పడుతూ అడుగులు వేసామని వివరించారు. 66 లక్షల మంది అవ్వా తాతాలకు,వితంతువులు, వికలాంగులకు గతంలో ఎన్నడూ లేనివిధంగా మంచి చేసాం, వారికి తోడుగా నిలిచామని చెప్పారు. ఏం చేసినా 40 శాతం ఓట్ బ్యాంక్ తగ్గించలేకపోయారన్నారు. ప్రతిపక్షంలో పోరాటాలు కొత్త కాదని చెప్పారు. పోరాటాలే చేసామని గుర్తు చేసారు. రాజకీయ పోరాటంలో చూడకూడని కష్టాలే చూసాము. ఎలాంటి కష్టాలైనా ఎదుర్కోవటానికి సిద్దంగా ఉంటామని జగన్ స్పష్టం చేసారు. అర కోటి మంది రైతుల ప్రేమ ఏమైందో తెలియదని వ్యాఖ్యానించారు. నేతన్న నేస్తం, వాహనమిత్ర, మత్స్యకార భరోసా వంటి ఎన్నో పథకాల ద్వారా మంచి చేసామని వివరించారు. ఇన్ని కోట్ల మందికి మంచి చేసి ఎప్పుడూ లేని విధంగా మేనిఫెస్టో అమలు చేసినా ఆ ప్రేమ ఏమైందోనని ఆవేదన వ్యక్తం చేసారు. తనకు పోరాటాలు కొత్త కాదని పోరాటానికి ఎప్పుడూ సిద్దమేనని జగన్ స్పష్టం చేసారు. కొత్త ప్రభుత్వం కు ఆల్ ది బెస్ట్ చెప్పిన జగన్ తన పదవికి రాజీనామా చేసారు. ప్రతిపక్ష పాత్రలో పేదవాడి కోసం నిలబడతామని జగన్ స్పష్టం చేసారు. తన రాజీనామా పత్రాన్ని ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ కు పంపారు. తాజాగా, జగన్ రాజీనామాను గవర్నర్ ఆమోదించారు. అయితే, నూతన ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ సీఎంగా ఉండాలని జగన్ ను గవర్నర్ కోరారు.

# ఎదురుదెబ్బలే పునరాగమనంగా.. తప్పులే పాఠాలుగా..

## - ఫలితాలపై రోజా రియాక్షన్




**నగరి** ;ఏపీలో ఎన్నికల కౌంటింగ్ కొనసాగుతోంది. ఎన్నికల ఫలితాల్లో తొలి రౌండ్ నుంచి టీడీపీ-జనసేన కూటమి తన చాటులోంది. సినీ నటి, నగరి అభ్యర్థి ఆర్కే రోజా సెల్వమణి నగరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వెనుకంజలో కొనసాగుతున్నారు.రోజాపై నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాశ్ ఆధిక్యంలో కొనసాగుతున్నారు.

ఓటమి దిశగా పయనిస్తుండటంతో ఫలితాలపై ఆర్కే రోజా ఎక్స్ వేదికగా తన స్పందనను అందరితో షేర్ చేసుకున్నారు. శక్తివంతమైన వ్యక్తి అంటే భయాలే విశ్వాసంగా .. ఎదురుదెబ్బలే పునరాగమనంగా.. మన్నింపులే నిర్ణయాలుగా, తప్పులే పాఠాలుగా నేర్చుకునే వ్యక్తి.. అనే సందేశాన్ని జోడిస్తూ.. ఓ చిన్నారి నుంచి రోజా పువ్వును స్వీకరిస్తున్న సందర్భంలో తీసిన ఫొటోను షేర్ చేశారు. ఇప్పుడీ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది.రాష్ట్రవ్యాప్తంగా కూటమిలో 135 (టీడీపీ) స్థానాల్లో, జనసేన 20 స్థానాల్లో లీడింగ్‌లో కొనసాగుతోంది. ఇక వైఎస్సార్సీపీ నుంచి పోటీలో ఉన్న మాజీ మంత్రులంతా వెనుకంజలో కొనసాగుతున్నారు.

# ఏపీలో తొలి విజయం..గోరంట్ల గెలుపు



**రాజమహేంద్రవరం** రాజమహేంద్రవరం గ్రామీణం అసెంబ్లీ నియోజకవర్గంలో నమోదైంది. తెదేపా అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి 50 వేలకుపైగా ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. సమీప ప్రత్యర్థి, వైకాపా అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణపై ఆయన విజయం సాధించారు. రూరల్ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్ అయనకు ఎమ్మెల్యే గా ధృవపత్రం అందచేసారు.

# ప్రతిపక్ష హోదా కోల్పోయిన వైసీపీ

**విజయవాడ :** ఏపీలో ఎన్నికల ఫలితాలు అధికార వైసిపికి చుక్కలు చూపిస్తున్నాయి. గత ఎన్నికల్లో 151 సీట్లు సాధించి.. సరికొత్త రికార్డు సృష్టించిన.. ఈసారి ఆ ఘనతను కొనసాగించలేకపోయింది.. ఐదేళ్లపాటు పరిపాలించినప్పటికీ.. ఏపీ ప్రజలు ఆ పరిపాలన పట్ల విసుగు చెంది టిడిపి కూటమికి అధికారాన్ని కట్టబెట్టారు. జగన్ పరిపాలనకు చరమగీతం పాడుతూ.. టిడిపి ఆధ్వర్యంలోని కూటమికి ఘన విజయం దిశగా తీర్పు ఇచ్చారు.. ఉదయం కౌంటింగ్ ప్రక్రియ మొదలైన నాటి నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఏ దశలోనూ వైసిపి అభ్యర్థులు కనీసం పోటీ ఇవ్వలేకపోయారు. వాస్తవానికి ఈ ఎన్నికల్లో పోరు హోరాహోరీగా సాగుతుందని అందరూ అంచనా వేశారు. కానీ ఓట్ల లెక్కింపులో ఆ దృశ్యం కనిపించలేదు.. వార్ వన్ సైడ్ అన్నట్టుగా కూటమి అభ్యర్థులు దుమ్ము లేపారు. 175 అసెంబ్లీ స్థానాలు ఉన్న ఏపీలో.. దాదాపు 90 శాతం నియోజకవర్గాలలో అదరగొట్టారు. ఇప్పటివరకు లెక్కించిన అన్ని రౌండ్లలోనూ వైసీపీ అభ్యర్థులు దారుణంగా వెనుకబడ్డారు. ప్రజా తీర్పు స్పష్టంగా కనిపిస్తున్న నేపథ్యంలో.. పలుచోట్ల కౌంటింగ్ కేంద్రాల నుంచి వైసీపీ అభ్యర్థులు ఇంటి ముఖం పడుతున్నారు.. ఇలా ఇంటి ముఖం పట్టిన వారిలో గుడివాడ అభ్యర్థి కొడాలి నాని, గన్నవరం అభ్యర్థి వల్లభనేని వంశీ ఉన్నారుఫలితాల సరళి పూర్తి ఏకపక్షంగా ఉండడంతో.. వైసిపికి కనీసం ప్రతిపక్ష హోదా అయినా దక్కుతుందా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఏపీ అసెంబ్లీ స్థానాల ప్రకారం ప్రతిపక్ష హోదా సాధించాలంటే కనీసం 18 మంది ఎమ్మెల్యేలను వైసిపి గెలుపొందాలి. అయితే ఇప్పటివరకు వెల్లడైన ఫలితాలలో.. 18కి లోపు స్థానాలలో వైసిపి లీడ్ లో కొనసాగుతోంది. వైసిపి కంటే సొంతంగానే జనసేన 20 స్థానాలలో ఆధిక్యంలో ఉంది. జనం తీర్పు స్పష్టంగా కనిపిస్తున్న నేపథ్యంలో వైసీపీకి ప్రతిపక్ష హోదా దక్కుతుందా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఒకవేళ ఇదే ట్రెండ్ కొనసాగితే వైసీపీ 14 స్థానాలకు మాత్రమే పరిమితం అవుతుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.ఇప్పటికే చాలామంది మంత్రులు ఓటమి బాట పట్టారు. ధర్మాన ప్రసాదరావు నుంచి మొదలు పెడితే అప్పలరాజు వరకు అందరూ ఓటమి అంచులో నిలిచారు. బొత్స సత్యనారాయణ వంటి వారు మొదట్లో కాస్త ముందంజలో ఉన్నప్పటికీ.. ఆ తర్వాత రౌండ్లలో ఆ దూకుడు కొనసాగించలేకపోయారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రమే ప్రస్తుతం పులివెందుల అసెంబ్లీ స్థానం నుంచి ముందంజలో ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ 151 స్థానాలకు గెలుచుకోగా.. టిడిపి 23 స్థానాలకు పరిమితమైంది. ఈసారి ఎన్నికల్లో వైసిపి గతంలో టిడిపి గెలుచుకున్న స్థాయిలో స్థానాలను దక్కించుకోలేకపోతుందనే వార్తలు వినిపిస్తున్నాయి.

# మంత్రులంతా ఓటమి పాలు

**విజయవాడ :** ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో దాదాపు మత్రులుగా పనిచేసిన వైకాపా అభ్యర్థులంతా ఓటమి దిశగా పయనిస్తున్నారు. ఇప్పటి వరకూ వెలువడిన ఓట్ల లెక్కింపు గణాంకాల్లో ఈ మంత్రులంతా వెనుకంజలో ఉండటం కనిపిస్తోంది.ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి వేవ్ స్పష్టంగా కనిపిస్తోంది.

ఎగ్జిట్ పోల్స్ ని మించి కూటమి అభ్యర్థులు లీడ్ లో ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ పంథా కొనసాగితే ఈఎన్నికల్లో గత ఎన్నికల్లో వైకాపా సాధించిన 151 స్థానాల మార్క్ ను కూటమి దాటేసేలా కనిపిస్తోంది. ముఖ్యంగా మంత్రుల ఇలాఖాలో ప్రతికూల ఫలితాలు స్పష్టంగా గోచరిస్తున్నాయి. పులివెందులలో సీఎం జగన్, చీపురు పల్లిలో బొత్స సత్యనారాయణ, పుంగనూరులో పెద్దిరె?డ్డి రామచంద్రారెడ్డి, సర్వేపల్లిలో కాకాణి గోవర్ధన్ రెడ్డి మినహా మంత్రులంతా ఓట్ల లెక్కింపులో భారీగా వెనకబడ్డారు. కాకాణి, బొత్స, పెద్దిరెడ్డి సైతం కొన్ని రౌండ్లలో స్వల్ప తేడాతో వెనకంజ వేయడం కనిపిస్తోంది.

రాజమండ్రి రూరల్ నుంచి పోటీ తెదేపా అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి తన సమీప వైకాపా అభ్యర్థి, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణపై 60 వేట ఓట్ల తేడాతో గెలిచారు. తాడేపల్లి గూడెంలో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తన సమీప జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ కంటే 15 వేల ఓట్ల మేర వె?నకంజలో ఉన్నారు. గోపాలపురం నియోజవర్గంలో హోం మంత్రి తానేటి వనిత సమీప తెదేపా అభ్యర్థి? మద్ది పాటి వెంకటరాజు కంటే 7 వేల ఓట్ల వెనకబడి ఉన్నారు. గాజువాకలో గుడివాడ అమర్ నాథ్ సమీప తెదేపా అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు కంటే 15 వేల ఓట్ల మేర వెనకబడి ఉన్నారు. అనకాపల్లి ఎంపీగా పోటీ చేసిన బుడి ముత్యాల నాయుడు సమీప భాజపా అభ్యర్థి సీఎం రమేష్ కంటే 25 వేల ఓట్ల వెనకబడి ఉన్నారు. పెనమలూరులో జోగి రమేశ్ తన సమీప తెదేపా అభ్యర్థి బోడే ప్రసాద్ కంటే దాదాపు 11 వేల ఓట్ల మేర వెనకబడి ఉన్నారు. తునిలో మంత్రి దాడిశెట్టి రాజా సమీప తెదేపా అభ్యర్థి యనమల దివ్య కంటే 22 వేల ఓట్లు వెనకంజలో ఉన్నారు.

అమలాపురంలో మంత్రి పినిపే విశ్వరూప్ సమీప తదేపా అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు కంటే 12వేల ఓట్ల వెనకంజలో ఉన్నారు. డోన్లో మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ తెదేపా అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి కంటే వెయ్యి ఓట్లు వెనకపబడ్డారు. నగరిలో మంత్రి ఆర్ కే రోజా సమీప తెదేపా అభ్యర్థి గాలి భాను ప్రకాశ్ కంటే ఎనిమిది వేల ఓట్లు వెనకబడ్డారు. సత్తెనపల్లిలో మంత్రి అంబటి రాంబాబు సమీప తెదేపా అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కంటే 13వేల ఓట్ల వెనకంజలో ఉన్నారు. కొండపిలో ఆదిమూలపు సురేష్ తెదేపా అభ్యర్థి డోలా బాల వీరాంజనేయ స్వామి కంటే రెండు వేల ఓట్ల వెనకంజలో ఉన్నారు. సంతనూతల పాడులో మేరుగు నాగార్జున తన సమీప అభ్యర్థి విజయ్ కుమార్ కంటే 15 వేల ఓట్ల వెనకంజలో ఉన్నారు మంత్రి విడదల రజనీ గుంటూరు వెస్ట్ నియోజకవర్గంలో తన సమీప అభ్యర్థి గల్లా మాధవి కంటూ 5 వేల ఓట్ల వె?నకంజలో ఉన్నారు. శ్రీకాకుళంలో ధర్మాన ప్రసాద్ రావు, పలాసలో సీదిరి అప్పలరాజు, పెనుగొండలో పోటీచేసిన ఉషాశ్రీచరణ్ సైతం వెనకంజలో ఉన్నారు. ఇదిలా ఉంటే వైకాపా ఇలాఖాలో మంత్రి గా పనిచేసి టికెట్ దక్కకపోవడంతో చివర్లో టీడీపీలో చేరి గుంతకల్ టికెట్ పొందిన గుమ్మనూరు జయరాం తన నియోజకవర్గంలో లీడ్ లో కొనసాగుతున్నారు

# బాలయ్య, చిరుల కొత్త సినిమాలపై ఆసక్తి





ఒకవైపు కొత్త సినిమాల విడుదలలు... మరోవైపు కొత్త కలయికల ప్రకటనలతోనూ చిత్రసీమ ఎప్పుడూ సందడిగా కనిపించేది. కానీ కొన్ని నెలలుగా స్తబ్దత నెలకొంది. ఎన్నికలు, ఐపీఎల్ కారణంగా విడుదలలు లేక వేసవి సీజన్ తుడిచి పెట్టుకుపోయింది. ఎన్నికల ఫలితాల తర్వాత మళ్లీ చిత్రసీమలో మునుపటి వాతావరణం నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే కొత్త సినిమాల విడుదలలు ఊపందుకున్నాయి. వారం వారం మూడు సినిమాలొస్తున్నాయి. ఈ నెలలోనే 'కల్కి 2898 ఎ.డి' రాబోతోంది. కొత్త సినిమాల ప్రకటనలకీ రంగం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఇటీవలే 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' వేడుకలో పాల్గొన్న అగ్ర కథానాయకుడు బాలకృష్ణ 'మాది ఓ కాంబినేషన్ ఉంది, త్వరలోనే ప్రకటిస్తామ'ని చెప్పారు. 'విశ్వంభర' చిత్రీకరణతో బిజీగా గడుపుతున్న మరో అగ్ర నటుడు చిరంజీవి నుంచీ ఓ కొత్త ప్రకటన వెలువడే అవకాశాలున్నట్టు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. మోహన్‌రాజా దర్శకత్వంలో, చిరంజీవి కథానాయకుడిగా ఓ చిత్రం రూపొందనున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన కథా చర్చలు జరుగుతున్నాయి. బి.వి.ఎస్.రవి కథని సిద్ధం చేశారు. సాయిదుర్గా తేజ్ సహా యువ కథానాయకులు నటించే పలు చిత్రాలు అధికారిక ప్రకటన కోసం సిద్ధమవుతున్నాయి.

## యాక్షన్ థ్రిల్లర్‌గా

# వాట్ ద ఫిష్




అదితి, జాన్సన్, హరినాథ్ పొలిచెర్లా, సుస్మితా ఛటర్జీ, సత్య ముఖ్య పాత్రలు పోషించిన ఈచిత్రం 'వాట్ ది ఫిష్'. వరుణ్ కోరుకొండ దర్శకత్వంలో విశాల్ బెజవాడ నిర్మించారు. 'ఇదొక యూనిక్ యాక్షన్ థ్రిల్లర్, హిలేరియస్ ఎంటర్‌టైనర్. ఇటీవల విడుదల చేసిన నిహారిక కొణిదెల, వెన్నెల కిశోర్ ఫస్ట్ లుక్ పోస్టర్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.' అని దర్శక నిర్మాతలు చెప్పారు. వివిధ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి శక్తికాంత్ కార్తీక్ సంగీతం అందిస్తున్నారు.

# ఇకపై మరింత కష్టపడతానంటున్న సమంత



నటిగా దక్షిణాదిలోని అగ్రతారల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్నారు సమంత. ఇటీవలే ఆమె మరో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ఐఎండీబీ ఇటీవలే 'గత దశాబ్దంలో ఎక్కువ మంది చూసిన భారతీయ సెలబ్రిటీల జాబితా'పై సర్వే నిర్వహించింది. ఇందులో సమంతకు 13వ స్థానం లభించింది. ఈ విషయంపై ఆమె స్పందించారు. 'నటిగా ఇలాంటి గుర్తింపు తెచ్చుకున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇది నా కృషికి, అదృష్టానికి తగిన ప్రతిఫలం. ఇండస్ట్రీలో ఇన్నేళ్లు ఎలా గడిచాయో తెలియట్లేదు. కెరీర్‌ను ఇప్పుడిప్పుడే మొదలుపెడ్తున్నట్టు ఉంది. వరుస సినిమాల్లో నటించేందుకు అద్భుతమైన పాత్రలు వస్తున్నాయి. ఇకపై తాను నటించే ప్రతీ సినిమాలో అభిమానుల కోసం రెట్టింపు కష్టపడతా' అని చెప్పారు. కాగా, ఈ జాబితాలో బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణెళి అగ్రస్థానంలో నిలువగా.. షారుక్ ఖాన్, ఐశ్వర్య రాయ్ బచ్చన్, ఆలియా భట్ తర్వాతి స్థానాల్లో నిలిచారు. దక్షిణాది నుంచి తమన్నా, నయనతార 16, 18వ స్థానంలో నిలిచారు.

## కంగువా తరవాత పూజాతో

# సూర్య మరో సినిమా

త్వరలో 'కంగువా'తో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమవుతున్నారు తమిళ కథానాయకుడు సూర్య. ప్రస్తుతం వరుస సినిమాలతో తీరిక లేకుండా గడుపుతున్న ఆయన..

తన 44వ చిత్రం కోసం దర్శకుడు కార్తీక్ సుబ్బరాజుతో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. పూజా హెగ్డే కథానాయిక. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఈ విషయాన్ని తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను పంచుకుంది చిత్రబృందం.

'లైట్స్, కెమెరా, యాక్షన్.. 'సూర్య 44' ప్రయాణం ప్రారంభమైంద'ని వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో సూర్య సరికొత్త లుక్‌లో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. లవ్ అండ్ వార్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తుంది.
జోజు జార్జ్, జయరామ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.





## మంచి రోజుల కోసం ఎదురు చూస్తున్నా

# పూజా హెగ్డే

మంగళూరు సోయగం పూజా హెగ్డేకు గత కొంతకాలంగా అదృష్టం కలిసి రావడం లేదు. ఆమె నటించిన చిత్రాలు వరుసగా పరాజయం చెందడంతో రేసులో పూర్తిగా వెనకబడిపోయింది. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తాను మంచి రోజుల కోసం ఎదురు చూస్తున్నానని ఆశాభావం వ్యక్తం చేసిందీ భామ. ఆమె కోరుకున్నట్లుగానే తమిళంలో సూర్య సరసన నటించే బంపరాఫర్‌ను దక్కించుకుంది. ప్రస్తుతం సూర్య పీరియాడిక్ చిత్రం 'కంగువ'లో నటిస్తున్నారు. ఇది పూర్తయిన వెంటనే కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఓ యాక్షన్ థ్రిల్లర్‌లో నటించనున్నారు. సూర్య నటించబోతున్న 44వ చిత్రమిది. ఈ నెలలోనే సెట్స్‌మీదకు వెళ్లనుంది. తాజాగా ఈ సినిమాలో కథానాయికగా పూజాహెగ్డేను ఖరారు చేశారు. 'బీస్ట్' తర్వాత పూజాహెగ్డే తమిళంలో మరే చిత్రంలో నటించలేదు. సుదీర్ఘ విరామం తర్వాత అక్కడ భారీ అవకాశాన్ని దక్కించుకోవడం విశేషం.

ఈ చిత్రం తప్పకుండా పూజాహెగ్డే కెరీర్‌కు బ్రేక్‌నిస్తుందని, ఆమె తిరిగి పూర్వ వైభవాన్ని సాధిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

## అవను రిలేషన్‌షిప్‌లోనే

# ఉన్నా

## కృతిశెట్టి కొంటె సమాధానం



తన తాజా సినిమా 'మనమే' ప్రమోషన్‌లో బిజీబిజీగా గడుపుతున్నది బెంగళూరుభామ కృతిశెట్టి. వరుసపెట్టి టీవీ ఛానళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చేస్తున్నది. ఈ క్రమంలో ఎదురవుతున్న చిలిపి ప్రశ్నలకు కూడా తెలివిగా సమాధానాలిచ్చేస్తున్నది ఈ అందాల బేబమ్మ. 'మీరు సింగిలా? రిలేషన్‌షిప్‌లో ఉన్నారా? అనే ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'నేను సింగిల్ కాదు. రిలేషన్‌లోనే ఉన్నా' అని సూటిగా సమాధానమిచ్చేసింది. 'ఎవరితో?' అనడిగితే.. 'నా పనితో.. నా పనితో రిలేషన్‌లో ఉన్నా' అంటూ నవ్వులు పూయించేసింది కృతిశెట్టి. కాబోయేవాడు ఎలావుండాలి? అనడిగితే.. 'మంచివాడై ఉండాలి. నిజాయితీపరుడై ఉండాలి. సాటివారిపై దయ కలిగినవాడై ఉండాలి' అంటూ అందంగా నవ్వేసింది. ఇంకా చెబుతూ 'నాకు డ్యాన్స్ చేయడం ఇష్టం. యాక్షన్ సినిమాలు ఇష్టం. హీరోల్లో రామ్‌చరణ్ అంటే అభిమానం. కలిసి నటించే అవకాశం వస్తే మిస్ చేసుకోను' అంటూ చెప్పుకొచ్చింది కృతిశెట్టి.

# ఫెయిల్ అయిన వారికి ఫార్మసిస్ట్ సర్టిఫికెట్ ఎలా ఇచ్చారు.?

- సర్టిఫికెట్ల జారీలో కోట్ల కుంభకోణం మాజీ అధ్యక్షుడు సంజయ్ రెడ్డి
- మాజీ చైర్మన్ నవీన్ మిట్టల్ డిప్యూటీ డైరెక్టర్ రందాన్ పై పూర్తిస్థాయి విచారణ చేయించాలి
- ఫెయిల్ అయిన వారికి రిజిస్ట్రేషన్లు చేయిస్తే పాసైన విద్యార్థుల పరిస్థితి ఏమిటి
- ఐఏఎస్ ఫెయిల్ అయిని ఐఏఎస్ గా పరిగణిస్తారా.?
- మరి ఫెయిల్ అయిన ఫార్మసిస్టులకు సర్టిఫికెట్లు జారీ చేశారు
- ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలు తుంగలో తొక్కడం ఏమిటి.?
- భారీ స్థాయిలో అవినీతికి చేసిన అధికారులపై రేవంత్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ విధానాలకు, ఫార్మసీ కౌన్సిల్ నియమ నిబంధనల కు వ్యతిరేకంగా పనిచేసి అవినీతికి పాల్పడుతూ ప్రభుత్వాన్ని ప్రక్క దోవ పట్టిస్తున్న డ్రగ్స్ కంట్రోల్, డిప్యూటీ డైరెక్టర్ రాందన్, పూర్వ రిజిస్ట్రార్, తెలంగాణ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్, ప్రభుత్వం వెంటనే కఠినంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఫార్మసిస్ట్ ల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పి సి ఐ ఎడ్యుకేషన్ రేగులేషన్స్ (ఫార్మసీ చట్టం) కు విరుద్ధంగా, ఫార్మసీలో ఫెయిల్ అయిన వారికి రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ సర్టిఫికెట్ జారీ చేయడాన్ని రాష్ట్ర ఫార్మసిస్ట్ లు మండి పడుతున్నారు. రిజిస్ట్రేషన్ ల ప్రక్రియలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సూచించిన నియమాలను తప్పక పాటించాలి లేదా రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్, రిజిస్ట్రార్,ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి తీసుకోవాలని మాజీ అధ్యక్షుడు సంజయ్ రెడ్డి, పలువురు ఫార్మసీ కళాశాలల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఫెయిల్ అయిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వడానికి ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి తీసుకుంటే అనుమతి పత్రం ఎక్కడ ఉందంటూ వాటిని ప్రజలకు చూపించాలని ఫార్మసీ విద్యార్థులు కోరుతున్నారు. బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తూ అవినీతికి అక్రమాలకు పాల్పడుతున్న పూర్వ రిజిస్ట్రార్, తెలంగాణ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ డ్రగ్స్ కంట్రోల్, డిప్యూటీ డైరెక్టర్ రాందాన్ పై ప్రభుత్వం కఠినంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర



ఫార్మసిస్ట్ ల సంఘాల డిమాండ్ చేస్తున్నాయి. ఈ మధ్యనే తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ లో డిప్లమా ఫార్మసీ విద్య వ రీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు రిజిస్ట్రేషన్ నమోదు చేసి రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ సర్టిఫికెట్స్ ఇచ్చిన విషయం వెలుగులోకి వచ్చిందని వార్తాలు పత్రికల్లో వచ్చిన విషయం ప్రజలందరికీ తెలిసిందే. 2021-2022 వరకు డిప్లమా ఫార్మసీ విద్య పరీక్షల్లో ఫెయిల్ అయిన వారికి రాందన్ రిజిస్ట్రేషన్ నమోదు చేసి రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ సర్టిఫికెట్స్ ఇచ్చిన విషయం వెలుగులోకి వచ్చిందని కానీ ఈ మధ్యనే తాను ఒక వార్తా పత్రికలో తాను రిజిస్ట్రార్ గా లేని టైమ్ లో 2009-2017 వరకు కూడా, ఫార్మసీ ఫెయిల్ అయిన వారికి రిజిస్ట్రేషన్ చేసానని రాందాన్ తెలిపాడన్నారు. తాను స్టేట్ బోర్డు టెక్నికల్ ఎడ్యుకేషన్ మాజీ చైర్మన్ నవీన్ మిట్టల్ ఇచ్చిన లెటర్ మేరకు చేశానని చెప్పారు.ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఎడ్యుకేషన్ రేగులేషన్స్ (ఫార్మసీ చట్టం) తెలిసి కూడా ఎలా బాధ్యతా రహితంగా ఫెయిల్ అయిన వారికి సర్టిఫికెట్లు జారీ చేశారని సంజయ్ రెడ్డి ప్రశ్నించారు. ఫెయిల్ అయిన వారికి ఫార్మసీ రిజిస్ట్రేషన్లు ,ఇష్టా రాజ్యంగా రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ సర్టిఫికెట్ లు ఎలా జారీ చేశారని ఫార్మసిస్ట్ లు మండి పడుతున్నారు. స్టేట్ బోర్డు టెక్నికల్ ఎడ్యుకేషన్ అనేది డిప్లొమా ఫార్మసీ కోర్సు, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇచ్చిన ఫార్మసీ ఎడ్యుకేషన్ రేగులేషన్స్ (ఫార్మసీ చట్టం) ప్రకారం, డిప్లొమా ఫార్మసీ కోర్సు ను కాలేజిలలో బోధన ప్రణాళిక ప్రకారం జరిపి పరీక్షలు జరుపుతుంది.పరీక్షల్లో 40% థియరీ , ప్రాక్టికల్స్ లో ఉత్తీర్ణత సాధించాలి.ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విద్యా చట్టం లో సూచించిన విధంగా మాత్రమే డిప్లొమా ఫార్మసీ పరీక్షల్లో అన్ని సబ్జెక్ట్స్ లో 40% థియరీ ,40% ప్రాక్టికల్స్ లో పాస్ ఐన వారికి మాత్రమే, (ట్రైనింగ్ హవర్స్)ఫార్మసీ కౌన్సిల్ ప్రెస్క్రైబ్డ్ హాస్పిటల్స్ లో చేస్తే , ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ నమోదు చేసి రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ సర్టిఫికెట్ జారీ చేయాలని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఎడ్యుకేషన్ రేగులేషన్స్ (ఫార్మసీ చట్టం) కు విరుద్ధంగా, డిప్లొమా ఫార్మసీ పరీక్షల్లో ఫెయిల్ అయిన వారికి కూడా రిజిస్ట్రేషన్ నమోదు చేసి రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ సర్టిఫికెట్ జారీ చేసిన రాందన్ కు ఎంత పెద్ద మొత్తంలో మామూలు అందాయో తెలపాలన్నారు.

## ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విధి విధానాలు..

ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనేది అపెక్స్ బాడీ, ఇది న్యూ ఢిల్లీ లో ఉంటుంది. దీని పరిధి లో అన్ని రాష్ట్రాల ఫార్మసీ కౌన్సిల్ లు 1948 ఫార్మసీ చట్టం ప్రకారం పని చేస్తాయి.ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా యొక్క విధి విధానాలకు అనుగణంగా అన్ని రాష్ట్రాల ఫార్మసీ కౌన్సిల్ లు పని చేస్తాయి. అదే విధంగా మన రాష్ట్రానికి చెందిన తెలంగాణ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ కూడా పని చేస్తుంది. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనేది దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల ఫార్మసీ కౌన్సిల్ లు పని తీరు ,ఫార్మసిస్ట్ ల రిజిస్ట్రేషన్ లు(డిప్లొమా ఫార్మసీ పరీక్షల్లో అన్ని సబ్జెక్ట్స్ లో 40% థియరీ ,40% ప్రాక్టికల్స్ లో పాస్ ఐన వారికి మాత్రమే) , రెనువల్స్ ప్రక్రియ, అన్ని ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ విద్యను, నాణ్యతను నియంత్రిస్తుంది.ఫార్మసీ కళాశాలలు స్థాపించడానికి పర్మిషన్ ఇస్తుంది. ఫార్మసీ కళాశాలలు తానికి చేస్తుంది.1948 ఫార్మసీ చట్టంను, ఫార్మసీ ప్రాక్టీస్ రేగులేషన్స్ ని నియంత్రిస్తుంది.రాష్ట్రాల ఫార్మసీ కౌన్సిల్ కు సంబంధించిన రిజిస్ట్రార్,ఫార్మసీ కౌన్సిల్ లో రిజిస్ట్రేషన్ ల ప్రక్రియలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సూచించిన నియమాలను తప్పక పాటించాలి లేదా రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్, రిజిస్ట్రార్,ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి తీసుకోవాలి.ఫెయిల్ అయిన వారికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు జారీ చేస్తే వారు మెడికల్ షాపు లో అజ్ఞానంతో ఒక మందు బదలు ఇంకో మందు ఇస్తే ప్రజల ప్రాణాలకే ప్రమాదం పొంచి ఉందన్నారు. రాందాన్ లాంటి ఒక్క వ్యక్తి వల్ల మొత్తం ప్రజలు, సమాజమే భ్రష్ట్ పడుతుందని ఈ నకిలీ ఫార్మసిస్ట్ ల వల్ల మన కుటుంబ సభ్యులకు, బందువులకు, ఫ్రెండ్స్ కు కూడా, మెడికల్ షాపుల్లో నకిలీ మందులిస్తే పరిస్థితి ఏమిటని మండిపడ్డారు.పి సి ఐ ఎడ్యుకేషన్ రేగులేషన్స్ (ఫార్మసీ చట్టం) కు విరుద్ధంగా, ఫార్మసీలో ఫెయిల్ అయిన వారికి రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ సర్టిఫికెట్ జారీ చేసినందుకు, బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తూ అవినీతికి అక్రమాలకు పాల్పడుతున్న రాందాన్ పూర్వ రిజిస్ట్రార్, తెలంగాణ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్, డ్రగ్స్ కంట్రోల్, డిప్యూటీ డైరెక్టర్ పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఫార్మసిస్ట్ సంగం మాజీ అధ్యక్షుడు సంజయ్ డిమాండ్ చేశారు.

## సీఎం రేవంత్ రెడ్డి డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కావాలని కోరుతున్నారా.?

మరి ఇలా ఫెయిల్ అయిన వారికి దొంగ ఫార్మసీ సర్టిఫికెట్లు ఇస్తే వారు ఇస్టా రాజ్యాంగ నార్కోటిక్ డ్రగ్స్, మత్తు కలిగించే మందులు ప్రజలకు విచ్చల విడిగా ఇచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రజలు మత్తు కు బానిసయ్యే అవకాశాలు ఉన్నాయి. డ్రగ్ పెడ్లర్ గా మారే అవకాశాలు ఉన్నాయన్నారు.ప్రభుత్వ విధానాలకు , ఫార్మసీ కౌన్సిల్ నియమ నిబంధనల కు వ్యతిరేకంగా పనిచేసి, అవినీతికి పాల్పడుతూ ప్రభుత్వాన్ని ప్రక్క దోవ పట్టిస్తున్న డ్రగ్స్ కంట్రోల్, డిప్యూటీ డైరెక్టర్ రాందన్, ఫెయిల్ అయిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్న కమిటీకి కమిటీ చైర్మన్ పై పూర్తిస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ జరిపి కఠినంగా చర్యలు తీసుకోవాలని సంజయ్ రెడ్డి కోరుతున్నారు.

# వయనాడ్, రాయ్‌బరేలీలో భారీ మెజార్టీతో రాహుల్ విక్టరీ

## - రెండింటిలో ఏది.?

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో రాయ్‌బరేలీ, వయనాడ్ లోక్‌సభ స్థానాల నుంచి పోటీ చేసి ఘన విజయం సాధించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి కొత్త సమస్య వచ్చి పడింది. రెండు స్థానాల్లోనూ ఇప్పుడు భారీ మెజార్టీతో గెలుపొందడంతో ఏ స్థానాన్ని ఉంచుకోవాలి, ఏ స్థానాన్ని వదులుకోవాలి అనే సందిగ్ధంలో రాహుల్ పడ్డారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమేథీ, కేరళలోని వయనాడ్ నుంచి రాహుల్ గాంధీ పోటీ చేయగా అమేథీలో ఓటమి పాలయ్యారు. దీంతో వయనాడ్‌లో గెలవడంతో ఎంపీగా కొనసాగారు. అయితే ఈసారి అలాంటి పరిస్థితి కాకుండా రెండు స్థానాల్లో విజయం దక్కింది.

దీంతో కొత్త చిక్కు వచ్చి పడింది. రాయ్‌బరేలీ స్థానాన్ని వదులుకుందాం అంటే.. అది కాంగ్రెస్ పార్టీకి కొన్నేళ్లుగా కంచుకోటలా ఉంది. అంతేకాకుండా తన తల్లి సోనియా గాంధీ వరుసగా గెలుస్తున్న సీటు కాబట్టి కొంత సెంటిమెంట్ కూడా ఉంటుంది. అదే సమయంలో వయనాడ్ నియోజకవర్గాన్ని వదులుకుందామనుకుంటే 2019 లో అమేథీలో ఓడిపోయినా వయనాడ్ ఓటర్లు రాహుల్ గాంధీని భారీ మెజార్టీతో లోక్‌సభకు పంపించారు. దీంతో వయనాడ్, రాయ్‌బరేలీ 2 స్థానాలు ఇప్పుడు రాహుల్ గాంధీకి ఎంతో కీలకంగా మారాయి. ప్రస్తుత ఎన్నికల్లో రాయ్‌బరేలీలో బీజేపీ నేత దినేశ్ ప్రతాప్ సింగ్‌పై 3.88 లక్షల ఓట్ల మెజార్టీతో రాహుల్ గెలిచారు. 2019 లో ఇదే స్థానంలో సోనియా గాంధీ సాధించిన మెజార్టీని రాహుల్ గాంధీ



దాటేయడం విశేషం. ఇక ప్రస్తుతం రాహుల్ గాంధీ సిట్టింగ్ స్థానమైన కేరళలోని వయనాడ్‌లో వరుసగా రెండోసారి జయకేతనం ఎగురవేశారు. సీపీఐ అభ్యర్థి అనీ రాజాపై 3.64 లక్షల ఓట్ల తేడాతో గెలుపొందారు. బీజేపీ తరపున పోటీ చేసిన కె.సురేంద్రన్ మూడో స్థానానికే పరిమితం అయ్యారు. అయితే తాజాగా ఎన్నికల ఫలితాల వెల్లడి తర్వాత కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రాహుల్ గాంధీ మాట్లాడారు. ఈ క్రమంలోనే రాయ్‌బరేలీ, వయనాడ్ నియోజకవర్గాల్లో ఏ స్థానాన్ని ఉంచుకుంటారు, ఏ స్థానాన్ని వదులుకుంటారు అనే ప్రశ్నను ఓ రిపోర్టర్ రాహుల్ గాంధీకి సంధించారు. అయితే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆయన సమాధానం ఇచ్చారు. రెండు స్థానాల్లో తాను గెలిచానని అయితే రెండు సీట్లకు ఎంపీగా ఉండటం కుదరని పని కానీ దానిపై ఇంకా ఎలాంటి నిర్ణయానికి రాలేదని చెప్పారు. ఇక రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ స్థానాన్ని వదులుకుని తన సోదరి ప్రియాంక గాంధీని ఆ స్థానంలో పోటీ చేయవచ్చనే ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి.

# ఈటల రాజేందర్ భారీ విజయం

## - మల్కాజిగిరిలో చిత్తుచిత్తుగా ఓడిపోయిన కాంగ్రెస్, బీఆర్ఎస్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తన సొంత నియోజకవర్గం హుజూరాబాద్‌లో ఓటమి పాలైన బీజేపీ నేత ఈటల రాజేందర్ తాజాగా మల్కాజ్ గిరి నుంచి ఘనమైన విజయాన్ని సొంతం చేసుకున్నారు. అతి పెద్ద నియోజకవర్గం అయిన మల్కాజ్ గిరిలో ఏకంగా ఆయనకు 9,80,712 ఓట్లు పోలయ్యాయి. సమీప ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డిపై 387375 ఓట్ల మెజారిటీ సాధించారు. రెండో స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి నిలవగా ఈమెకు 5,93,337 ఓట్లు వచ్చాయి. మూడో స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఉన్నారు. ఈయనకు మల్కాజ్ గిరిలో 2,98,697 ఓట్లు వచ్చాయి. ఈ నియోజకవర్గంలో నోటాకు 13,206 ఓట్లు పడ్డాయి. తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, బీజేపీ జోరుగా ఉన్నాయి. దేశంలోనే అతి పెద్దైన మల్కాజ్ గిరి లోక్ సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తొలి నుంచి ముందంజలోనే కొనసాగారు. ఉదయం 11.30 గంటల సమయానికి ఈయనకు 6,23,372 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి 256496 ఓట్ల తేడాతో వెనుకబడి ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మా రెడ్డి 425036 ఓట్ల తేడాతో మూడో స్థానానికి పరిమితం అయ్యారు. తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో ఎక్కడా బీఆర్ఎస్ పార్టీ ఆధిక్యంలో కనిపించలేదు. ప్రతి చోటా మూడో స్థానంలోనే ఉంటూ వచ్చింది.

# పవన్ తో చంద్రబాబు భేటీ

## - ప్రభుత్వం ఏర్పాటుపై చర్చ



**గుంటూరు (ప్రశ్న న్యూస్)** ఏపీ ఎన్నికల్లో టీడీపీ కూటమి గ్రాండ్ విక్టరీ కొట్టింది. ఊహించని రీతిలో జిల్లాలకు జిల్లాలను స్వీప్ చేసింది. ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన కార్యాలయానికి వెళ్లారు చంద్రబాబు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ చంద్రబాబుకు సాదర స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబుకు పవన్ కల్యాణ్ తన కుమారుడు అకీరా నందన్‌ను పరిచయం చేశారు. ఈ సందర్భంగా అకీరా నందన్ చంద్రబాబు కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఇరువురు నేతలు పరస్పరం అభినందనలు తెలియజేసుకున్నారు. ఇద్దరి మధ్య దాదాపు గంటకు పైగా చర్చలు జరిగాయి. కూటమి ఘనవిజయం నేపథ్యంలో నూతన ప్రభుత్వ ఏర్పాటు, ప్రమాణ స్వీకారంపై ఇరువురి మధ్య చర్చలు జరిగాయి. నేడు ఢిల్లీలో ఎన్డీయే సమావేశానికి హాజరయ్యే అంశంపైనా చంద్రబాబు, పవన్ సమాలోచనలు జరిపారు. కాగా, చంద్రబాబు, పవన్ నేడు మరోసారి సమావేశమయ్యే అవకాశాలున్నాయి.

# ఇది కచ్చితంగా నిరాశే

## - ఓటమి ఎదురైనా కష్టపడుతూనే ఉంటామన్న కేటీఆర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో లోక్ సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. అయితే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ కనీసం ఖాతా కూడా ఓపెన్ చేయలేకపోయింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా 12 నుంచి 14 ఎంపీ సీట్లు గెలుస్తామని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చెప్పగా ఎగ్జిట్ పోల్స్ మాత్రం అందుకు పూర్తి భిన్నంగా వచ్చిన విషయం తెలిసిందే. అప్పుడు కూడా ఎగ్జిట్ పోల్స్ అంతా గోల్‌మాల్‌గా ఉన్నాయని ఫలితాలు కచ్చితంగా తమకు అనుకూలంగా ఉంటాయని చెప్పుకొచ్చారు. కట్ చేస్తూ ఫలితాల్లో కనీసం ఒక్క రౌండ్‌లోనూ ఆధిక్యం ప్రదర్శించకపోగా 17 స్థానాల్లో ఎక్కడా కూడా రెండో స్థానంలోనూ నిలబడలేకపోయింది కారు పార్టీ. ఈ అనూహ్య ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి ఇప్పటవరకు 24 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానంలో అన్ని రకాల ఎత్తుపల్లాలను చూశామని కేటీఆర్ తెలిపారు. అద్భుతమైన విజయాలతో పాటు అనేక ఎదురుదెబ్బలు చవిచూశామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే తమ పార్టీకి అతి పెద్ద విజయమని చెప్పుకొచ్చారు. ఒక ప్రాంతీయ పార్టీగా వరుసగా రెండుసార్లు అద్భుతమైన మెజార్టీలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నామని కేటీఆర్ తెలిపారు. 2014 ఎన్నికల్లో 63 సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే 2018 ఎన్నికల్లో 88 స్థానాలతో రెండోసారి విజయవంతంగా అధికారంలోకి వచ్చామని వివరించారు. ఇక ప్రస్తుతం కూడా అసెంబ్లీ ఎన్నికల్లో 39 సీట్లతో 1/3 స్థానాలతో ప్రధాన ప్రతిపక్షంగా కొనసాగుతున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. ఈరోజు వచ్చిన ఎన్నికల ఫలితాలు కచ్చితంగా నిరాశను కలిగించాయని కేటీఆర్ పేర్కొన్నారు. అయినా ఎప్పటిలాగే మరింత కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకుంటామన్న విశ్వాసం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న కాలంలో బూడిదలోంచి లేచిన ఫీనిక్స్ పక్షిలా తప్పకుండా పైకి లేస్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ట్వీట్ చేశారు కేటీఆర్.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588